
మానేరు
# జనత ®
తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక



సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ, ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్



1.6.2026 సోమవారం Monday | సంపుటి (Volume): 11 సంచిక (Issue) : 34 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar

# రాయల్స్ అ'ద్వితీయ'ం

## బెంగళూరుదే ఐపీఎల్ ట్రోఫీ

- వరుసగా రెండో టైటిల్ సొంతం
- ఫైనల్లో గుజరాత్‌పై ఘనవిజయం
- అదరగొట్టిన విరాట్ కోహ్లి

సుదీర్ఘ నిరీక్షణకు తెర దించి గతేడాది తొలి ఐపీఎల్ కప్‌ను ముద్దాడిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు నుంచి మరో అ'ద్వితీయ' షో. గుజరాత్ టైటాన్స్‌తో ఫైనల్‌కు ముందు సమవుజ్జీల పోరుగా భావించినా.. తాము బరిలోకి దిగితే వార్ వన్‌సైడే అని రజత్ సేన నిరూపించింది. ఆర్సీబీ బౌలర్ల ధాటికి అతికష్టంగా 150 పరుగులు దాటిన టైటాన్స్‌కు ఫలితమేంటో ముందే తెలిసొచ్చింది. అనంతరం ఛేజింగ్ రారాజు విరాట్ కోహ్లి అజేయ హాఫ్ సెంచరీతో కడదాకా నిలిచి, బెంగళూరు వరుసగా రెండోసారి కప్‌ను ముద్దాడేలా చేశాడు. అటు బెంగళూరు ఫ్యాన్స్ 'ఈ సాలనూ కప్ నమ్దే' అంటూ విజయ సంబరాలతో మైమరిచిపోయారు. ఇక క్వాలిఫయర్2లో చూపిన పోరాట పటిమను సొంత గడ్డపై పునరావృతం చేయలేక గిల్ సేన నీరాశలో మునిగింది.





## ఎండల్లో జాగ్రత్త

- పానకం, మజ్జిగ, సాంబారుతో ఉపశమనం
- దేశీయ పానీయాలను సేవించండి
- బంగినపల్లి, సువర్ణ రేఖ రుచి అద్భుతం
- భిన్నత్వంలో ఏకత్వానికి మామిడి నిదర్శనం
- దేశ ఆర్థిక వ్యవస్థకు మామిడి రైతులు కీలకం
- మన్కి బాత్‌లో ప్రధాని మోడీ వెల్లడి

.. వివరాలు 4లో

## 3న నిరాడంబరంగా డీకే ప్రమాణం

- లోకభవన్లో కొద్ది మంది సమక్షంలో కార్యక్రమం
- సిద్ధరామయ్య అనుచరుల వ్యతిరేకతే కారణాలు

.. వివరాలు 4లో



# రాజ్యసభ ఎన్నికల తర్వాత మంత్రివర్గ విస్తరణ

- హైదరాబాద్‌లో ఖర్గేతో కీలక నేతల రహస్య భేటీ
- విడివిడిగా కలిసిన మంత్రులు ఉత్తమ్, వాకిటి శ్రీహరి
- పొద్దుపోయేంత వరకు సమాలోచనలు జరిపిన డిప్యూటీ సీఎం భట్టి
- ఖర్గేతో అల్పాహార విందుకు హాజరైన పీసీసీ చీఫ్ మహేష్
- అనంతరం ఖర్గేతో సీఎం రేవంత్ ఏకాంత చర్చలు
- పదో తేదీ తర్వాత ఢిల్లీ రమ్మని రేవంత్‌కు చెప్పిన ఖర్గే?

**జనతా న్యూస్, హైదరాబాద్ :** రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ సంగతి రాజ్యసభ ఎన్నికల తరువాతే చూద్దామని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే స్పష్టం చేసినట్టు తెలిసింది. తన స్వస్థలం గుల్బర్గా పర్యటనకు ఢిల్లీ నుంచిశనివారం సాయంత్రం హైదరాబాద్ వచ్చిన మల్లి ఖార్జున ఖర్గేతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు

మిగతా 2 లో

## ఎంప్లాయీస్ హెల్త్‌కు భరోసా

- ఉద్యోగుల హెల్త్ స్కీంపై కీలక నిర్ణయం
- ఎంప్లాయిూ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా అమలుకు ఏర్పాట్లు
- ట్రస్ట్ సీఈఓగా ప్రభుత్వ ఉద్యోగికే అవకాశం
- సమీక్షించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

02

# ఉచిత కరెంట్ రద్దుకు కుట్ర!



- రైతు డిస్కం కాదు.. కాంగ్రెస్ మోసం డిస్కం
- అప్పుడు 3 గం.లు చాలని.. ఇప్పుడు 24గం.లు అంటే నమ్మాలా?
- దమ్ముంటే 420 హామీలు అమలు చేసి ఓట్లడుగు
- భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

రైతు డిస్కమ్ పేరుతో రైతులకిచ్చే ఉచిత విద్యుత్ను రద్దుచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు.

03

# రైతుకు డిస్కం ఉరి

- విద్యుత్ రంగం ప్రైవేటీకరణకే మూడో డిస్కం
- గుజరాత్ మాదిరిగా ఇక్కడ కూడా 8 గంటలకే కుదించేందుకు కుట్ర
- భారాస శాసనసభ పక్ష ఉపనేత హరీష్ రావు



# కుంభమేళాలా గోదావరి పుష్కరాలు

**వచ్చే ఏడాది నిర్వహణకు భారీ ఏర్పాట్లు**

**రవాణా సౌకర్యాలు మెరుగు పరుస్తాం**

**మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు**



**మంథని :** వచ్చే ఏడాది వచ్చే గోదావరి పుష్కరాలను కుంభమేళాను తలపించే స్థాయిలో నిర్వహించేందుకు సమగ్ర కార్యాచరణ సిద్ధం చేస్తున్నా మని, ఇందుకోసం ప్రభుత్వం క్యాబినెట్ సబ్కమిటీని నియమించిందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చెప్పారు. కోట్లాది మంది భక్తులు పుష్కరాలకు తరలి వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి గ్రామం నుంచి పుష్కర క్షేత్రాలకు చేరుకునేలా రవాణా సదుపాయాలు కల్పి స్తామని తెలిపారు. బాసర నుంచి భద్రాచలం వరకు బస్టాండ్లను ఆధునికీకరించడం తో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. సమ్మక్క-సారలమ్మ జాతరకు ఏర్పాటు చేసిన తరహాలోనే పుష్కరాలలో బస్సు సర్వీసులు నడుపుతామని తెలిపారు. పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపల్ పరిధిలోని మంథని బస్టాండ్లో ఆదివారం రూ.93 లక్షల వ్యయంతో చేపట్టనున్న అదనపు ప్లాట్ఫా రాలు, అభివృద్ధి పనులకు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, రీజనల్ కరీంనగర్ మేనేజర్ రాజు, డిప్యూటీ ఆర్.యం. (ఎం) మల్లేశం, డిపో మేనేజర్ శ్రావణ్ కుమార్, ఆర్డిఓ సురేష్ పాల్గొన్నారు.

# నేటి నుంచి ఇంటర్ క్లాసులు

**ముగిసిన వేసవి సెలవులు**

**హైదరాబాద్ :** రాష్ట్రంలోని ఇంటర్మీడియట్ విద్యార్థులకు వేసవి సెలవులు ముగిశాయి. సుదీర్ఘ విరామం తర్వాత సోమవారం (జూన్ 1) జూనియర్ కళాశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు సోమవారం నుంచే తరగతులు ప్రారంభం కానున్నట్లు ఇంటర్ బోర్డు ప్రకటించింది. ఇప్పటికే విడుదల చేసిన అకడమిక్ క్యాలెండర్ ప్రకారం విద్యాసంస్థలు నడవనున్నాయని, షెడ్యూల్ ప్రకారమే తరగతులు నిర్వహిస్తామని అధికారులు స్పష్టం చేశారు. సెలవులు ముగియడంతో విద్యార్థులు కొత్త విద్యా సంవత్సరానికి సిద్ధమయ్యారు. కాగా, ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు మాత్రం జూన్ 12 నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి.

# నేడు జేఈఈ అడ్వాన్స్డ్ ఫలితాలు

**హైదరాబాద్ :** దేశంలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)ల్లో సీట్ల భర్తీ కోసం నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్డ్ 2026 ఫలితాలు సోమవారం విడుదల కానున్నాయి. ఈ ఏడాది పరీక్షను విజయవంతంగా నిర్వహించిన ఐఐటీ రూర్కీ ఈ మేరకు అధికారిక ప్రకటన వెలువరించింది. ఉదయం 10 గంటలకు విద్యార్థుల ఫైనల్ ఆన్సర్ కీతో పాటు ఫలితాల స్కోర్కార్డులు, ర్యాంకులు విడుదల చేయనున్నారు. మే 15న ప్రాథమిక కీ విడుదల చేయగా 26 వరకు అభ్యంతరాలను స్వీకరించింది. మే 17న రెండు షిఫ్టుల్లో జేఈఈ అడ్వాన్స్డ్ పరీక్షదేశ వ్యాప్తంగా నిర్వహించింది.

# టెట్ షెడ్యూల్ విడుదల

**ఈ నెల 16 నుంచి పరీక్షలు ప్రారంభం**

**22 వరకు 10 సెషన్లలో ఆన్లైన్ పరీక్షలు**

**ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టుల్లో నిర్వహణ**

**హైదరాబాద్ :** తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టీజీటెట్) జూన్-2026 రాసే అభ్యర్థులకు విద్యాశాఖ కీలక అప్ డేట్ ఇచ్చింది. టెట్ పరీక్షల నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్ను ఎస్సీఈఆర్టీ డైరెక్టర్, టెట్ కన్వీనర్ రమేష్ ఆదివారం విడుదల చేశారు. జూన్ 16వ తేదీ నుంచి 22వ తేదీ వరకు మొత్తం ఐదు రోజులపాటు ఆన్లైన్ పద్ధతిలో ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రతిరోజూ రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. మొదటి సెషన్ (సెషన్-1) ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు, రెండవ సెషన్ (సెషన్-2) మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. జిల్లాల వారీగా అభ్యర్థులకు కేటాయించిన సెషన్లు, సెంటర్ల వివరాలను అధికారిక వెబ్సైట్ స్కూల్ ఎడ్యుకేషన్లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఇకటెట్ హాల్ టికెట్లు జూన్ 9 తర్వాత అధికారిక వెబ్సైట్లో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్లు పరీక్షా కేంద్రాల సమాచారాన్ని వెబ్సైట్ ద్వారా ఎప్పటికప్పుడు చూసుకోవాలని కన్వీనర్ రమేష్ సూచించారు.

# దోస్త్ 52,302 మందికి సీట్ల కేటాయింపు

**హైదరాబాద్ :** రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న దోస్త్-2026 రెండో విడత సీట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తయింది. ఈ విడతలో మొత్తం 52,302 మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించినట్లు తెలంగాణ రాష్ట్ర ఉన్నతవిద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఒక ప్రకటనలో తెలిపారు. రెండో విడతలో 46,504 మంది కొత్తగా నమోదు చేసుకోగా, వెబ్ ఆప్షన్లు నమోదు చేసిన మొత్తం 60,439 మందిలో 52,302 మందికి సీట్లు కేటాయించినట్లు తెలిపారు. వీరిలో 7,737 మంది విద్యార్థులు మొదటి విడతలో సీటు వచ్చినా, మెరుగైన ఆప్షన్ కోసం ప్రయత్నించి సీటు సాధించిన వారు ఉన్నారు. కేవలం తక్కువ సంఖ్యలో వెడ్ఆప్షన్లు ఇవ్వడం వల్ల 8,137 మంది విద్యార్థులకు ఈ విడతలో సీట్లు దక్కలేదని అధికారులు వెల్లడించారు. అత్యధికంగా కామర్స్ విభాగంలో 21,431 మందికి సీట్లు లభించాయి. ఆ తర్వాత ఫిజికల్ సైన్సెస్లో 15,245, లైఫ్ సైన్సెస్లో 9,664, ఆర్ట్స్ విభాగంలో 5,955 మందికి సీట్లు కేటాయించారు.

**సెల్ఫ్ రిపోర్టింగ్, ఫేజ్-3 రిజిస్ట్రేషన్లు ఆరంభం**

సీటు పొందిన విద్యార్థుల సెల్ఫ్ రిపోర్లింగ్ ఆదివారం ఆరంభమైంది. జూన్ 5వ తేదీ వరకు ఆన్లైన్లో జరిగేసెల్ఫ్ రిపోర్టింగ్లో అభ్యర్థులు రూ.500 లేదా రూ. 1000 చెల్లించి సీటును రిజర్వ్ చేసుకోవాలి. అయితే, ప్రభుత్వ, విశ్వవిద్యాల య కళాశాలల్లో సీటు పొంది, ఫీజు రీయింబర్స్మెంట్కు అర్హత ఉన్న విద్యార్థులు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవ సరం లేదని అధికారులు సూచించారు. దోస్తే మూడోవిడత రిజిస్ట్రేషన్లు, వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఆదివారం ప్రారంభమై జూన్ 16 వరకు కొనసాగుతుంది. మూడో విడత సీట్లను జూన్ 20న కేటాయించనున్నట్లు వెల్లడించారు. సీటు వచ్చిన అభ్యర్థులు మరింత మెరుగైన కళాశాల కోసం ప్రయత్నించాలనుకుంటే, ప్రస్తుతం వచ్చిన సీటును ఆన్లైన్ రిపోర్టింగ్ ద్వారా భద్రపరుచుకుని, తదుపరి విడతలో సైడింగ్ కోసం వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చని అధికారులు సూచించారు. ఫేజ్-1, 2, 3 లలో సీట్లు పొంది ఆన్లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేసిన విద్యార్థులందరూ జూన్ 20 నుండి 27వ తేదీ మధ్యలో సంబంధిత కళాశాలలకు వెళ్లి సర్టిఫికేట్లతో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నిర్ణీత సమయంలోగా కాలేజీలో రిపోర్ట్ చేయని వారు తమ సీటు। ను కోల్పోతారని అధికారులు తెలిపారు. సీట్ల కేటాయింపు వివరాలను విద్యార్థులు తమ రిజిస్టర్డ్ మొబైల్ నంబరు వచ్చే ఎస్ఎంఎస్ ద్వారా లేదా దోస్త్ వెబ్సైట్లో లాగిన్ అయి తెలుసుకోవచ్చని అన్నారు.

# రాజ్యసభ ఎన్నికల తర్వాత మంత్రివర్గ విస్తరణ

మొదటి పేజీ తరువాయి



ఉత్తమ్కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి విడివిడిగా సమావేశమయ్యారు. ఈ సంద ర్భంగా సీఎం రేవంత్రెడ్డితో దీనిపై స్పష్టత ఇచ్చినట్టు తెలిసింది. ఆదివారం ఉదయం ఖర్గేతో సుదీర్ఘంగా సమావేశమైన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి రెండున్నరేళ్ళలో చేపట్టిన కార్యక్రమాలు, పథకాలపై నివేదించినట్టు చెబుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన, ఇవ్వని హామీలన్నింటినీ అమలు చేసి ప్రజలతో శభాష్ అనిపిం చుకున్నామని రోజులో 18 గంటలు పని చేస్తున్నామని చెప్పిన ట్టు సమాచారం. పార్టీ పదవులను భర్తీ చేస్తున్నామని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకాలను చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని రేవంత్ చెప్పగా ఎందుకు ఈ విషయంలో జాప్యం జరుగుతోంది ఢిల్లీ వెళ్ళాక వెళ్ళాక ఈ అంశాన్ని పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తో చర్చించి నిర్ణయం తీసుకుంటా నని హామీ ఇచ్చినట్టు సమాచారం. మంత్రివర్గ విస్తరణ కూడా చేపట్టవలసిన అవసరం ఉ ందని ఇంకా రెండు ఉమ్మడి జిల్లా లకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం కల్పించవలసి ఉందని రేవం త్ అన్నట్టు తెలుస్తోంది. జూన్ రెండు లేదా మూడవ వారంలో ఇందుకు ముహూర్తం ఖరారు చేద్దామని పదో తేదీ తర్వాత ఢిల్లీ రావాలని ఖర్గే రేవంతు చెప్పినట్టు సమాచారం. పార్టీ తెలం గాణ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ పార్టీ శ్రీ కార్యక్ర కార్యక్రమాల అమలుపై ఖర్గే కి నివేదించినట్టు సమాచారం. అంతకు ముందురోజైన శనివారం రాత్రి ఏడు గంటల ప్రాంతంలో సాగునీటి పారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శంషాబాద్ విమానాశ్రయం సమీపంలో ఓ హోటల్లో బస చేసిన ఖర్గేని కలిశారు. రెండు గంటలపాటు ఇరువురు నేతలు ఏకాంతంగా మాట్లాడుకున్నా రు. ప్రభుత్వ పనితీరు, ఎన్నికల హామీల అమలు, పార్టీ పరిస్థి తితో పాటు పలు కీలక అంశాలపై వీరి మధ్య చర్చలు జరిపినట్లు అత్యంత విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు అవుతున్నందున అమలు చేయవలసిన కార్యక్రమాలపై ఖర్గే చర్చించినట్టు తెలుస్తోంది. మంత్రివర్గ నట్లు విస్తరణ త్వరితగతిన చేపట్టాలని ఆలస్యమయ్యే కొద్ది లేనిపోని ఆరోపణలు వస్తున్నాయని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఖర్గేతో చెప్పిన ట్టు తెలుస్తోంది. ఉత్తమ్ భేటీ ముగిశాక ఖర్గేకి అత్యంత సన్నిహితుడైన పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆయనతో భేటీ అయ్యారు. రాత్రి పది గంటల ప్రాంతంలో హోటల్కు చేరుకున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రాత్రి పొద్దు పోయేంతవరకు ఖర్గేతో సమ ప్రభుత్వం, పార్టీ అంశాలు ఎన్నికల హామీల అమలుతోపాటు తాను నిర్వహిస్తున్న ఆర్థిక, ఇంధన శాఖలకు సంబంధించి అధి కారంలోకి వచ్చిన ఈరెండున్నరేళ్లలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేసిన పథకాలు, కార్యక్రమాలను భట్టి విశదీకరించి నట్టు సమాచారం. ఆదివారం ఉదయం ఖర్గేతో అల్పాహార విం దుకు హాజరైన పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పార్టీపరంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. సర్పై దృష్టి సారించామని రెండు రోజుల క్రితం ఈ అంశంపై నాయ కుల్లో అవగాహన కల్పించేందుకు మేధో మథన సదస్సు నిర్వహించామని తెలిపారు. సర్ పై మంత్రులు, ఎమ్మెల్యేలకు బాధ్యతలు అప్పగించామని ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక్కొక్కరిని ఇంచార్జ్ గా నియమించి ఓటర్ల తొలగింపు అంశం లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించామని చెప్పారు. పార్టీ నిర్వహిస్తున్న కార్యక్రమాలపై ఖర్గే పూర్తి సంతృప్తి వ్యక్తం చేసినట్టు చెబుతున్నారు. సర్పై ప్రత్యేక

**ఖాళీగా రెండు మంత్రి పదవులు**

తెలంగాణ మంత్రివర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిపి 10 మంది ఉన్నారు. ఇంకా రెండు మంత్రి పదవులను భర్తీ చేయవలసి ఉంది. నిజామాబాద్, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాల నుంచి మంత్రివర్గంలో ఇప్పటిదాకా ప్రాతినిధ్యం కల్పించ లేదు. నిజామాబాద్ జిల్లా నుంచి క్యాబినెట్ హోదాతో ప్రభుత్వ సలహాదారుగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఉన్నారు. ఈ ఉమ్మడిజిల్లా నుంచి మరొకరికి అవకాశం ఇవ్వాలంటే ఎల్లారెడ్డి ఎమ్మెల్యే ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాం రావు ఉన్నారు. ఈ ఇద్దరి సామజిక వర్గాలకు చెందిన వారు అని ఇప్పటికే మంత్రులుగా ఉన్నారు. మాజీ మంత్రి షబ్బీర్ ఆలీ, పీసీసీ చీఫ్ మహేష్ మంత్రి పదవులను ఆశిస్తున్నట్టు సమా చారం, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి మంత్రివర్గంలో చోటు కోసం కీలక ఎమ్మెల్యేలు రంగంలోకి దిగారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఇటీవల కుటుంబ సభ్యులతో కలిసి పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని కలిశారు. తెలంగాణ ఉ ద్యమంలో తాను కీలక పాత్ర పోషించానని, బీఆర్ ఎస్ ప్రజా వ్యతికేక విధానాలకు నిరసనగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాతోపాటు తెలం గాణవ్యాప్తంగా అలుపెరగని పోరాటం చేశానని రామ్మోహన్ రెడ్డి రాహుల్ గాంధీకి చెప్పారు. మంత్రివర్గ విస్తరణలో తనకు అవకాశం ఇవ్వాలని కోరగా అందుకు ఆయన సమ్మతం తెలి పారని రామ్మోహన్ రెడ్డి చెప్పారు. ఇబ్రహీం పట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సైతం మంత్రి పదవిని ఆశిస్తున్నారు. రంగారెడ్డి సోదరుడు రాత్రెడ్డికి కార్పోరేషన్ పదవిని ఇవ్వడంతో రంగారెడ్డికి మంత్రి పదవి కట్టబెడతారా లేదా అన్నది తేలాల్సి ఉంది. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ రెండు రోజుల పాటు ఢిల్లీలో మకాం వేసి పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లిఖార్జున ఖర్గే లను కలిసి పార్టీలో సీనియర్ అయిన తనకు మంత్రిగా అవకాశం ఇవ్వాలని కోరినట్టు సమాచారం.

# ఎంప్లాయీస్ హెల్త్కు భరోసా

**ఉద్యోగుల హెల్త్ స్కీంపై కీలక నిర్ణయం**

**ఎంప్లాయీ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా అమలుకు ఏర్పాట్లు**

**సమీక్షించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్ :** ప్రభుత్వ ఉద్యోగుల హెల్త్ స్కీంకు సంబంధించి గుడ్న్యూస్ చెప్పేందుకు సీఎం రేవంత్రెడ్డి సిద్ధమవుతున్నారు. ఉద్యోగులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఉద్యోగుల హెల్త్ స్కీంపై కీలక నిర్ణయం తీసుకునేందుకు సీఎం కీలక సమావేశానికి రెడీ అవుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రత కు సంబంధించి నగదు రహిత(క్యాషెస్) వైద్య సేవలే లక్ష్యంగా 'ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్' అమలుపై రాష్ట్ర ప్రభుత్వం సద్వారా ఫోకస్ పెట్టింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఈ స్కీమ్ పథకంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులతో నేడు ఉన్నతస్థాయి సమీక్షనిర్వహించనున్నారు. ఎంప్లాయి హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా అమలు కానున్న ఈ పథకానికి ఉద్యోగ సంఘాల నుంచి ఆరుగురు, పెన్షనర్ల నుంచి ఇద్దరు ప్రతినిధులు ఈ ట్రస్ట్ సభ్యులుగా ప్రభుత్వం నియమించబోతోంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి ఒకరిని ఈ ట్రస్టుకు సీఈవోగా నియమించనున్నారు. ఈ మేరకు ఈ కమిటీని సోమవారం ప్రకటించే అవకాశముంది. ఈ పథకం అమలుకు అవసరమైన వివరాల సేకరణ ఇప్పటికే మొదలుకాగా ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యుల వివరాలను సేకరించేందుకు ఫైనాన్స్ శాఖ ఇప్పటికే అన్ని శాఖలకు సర్క్యులర్ జారీ చేసింది. మే 31లోపు డేటా-అప్లోడ్ చేయాలని స్పష్టం చేసింది. ఈ గడువు ముగియడం తో నివేదిక రెడీ చేసింది. ఈ వివరాల ఆధారంగా డిజిటల్ హెల్త్ కార్డులు, క్యాషెస్ చికిత్స సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ సందర్భంగా పథకాన్ని ఎంప్లాయి హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా ద్వారా అమలు చేయాలని సీఎం రేవంత్ నిర్ణయించారు. ట్రస్ట్ లో ఉద్యోగ సంఘాల నుంచి ఆరుగురు ప్రతినిధులకు, పెన్షనర్ల నుంచి ఇద్దరు సభ్యులకు అవకాశం కల్పించాలని నిశ్చయించా రు. ప్రభుత్వ ఉద్యోగినే ట్రస్ట్ సీఈవోగా నియమించాలని నిర్ణ యించారు. ఈ మేరకు సోమవారం ట్రస్ట్ కమిటీని ప్రకటించే అవకాశాలున్నాయి. డేటా అప్లోడ్ తర్వాత హెల్త్ కారులు మంజూరు అయ్యే అవకాశం ఉంది. కాగా, ఈ పథకం ద్వారా నగదు రహిత వైద్య సేవలను ప్రభుత్వం అందించనుంది. దీని ద్వారా ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పించనుంది.

# అవతరణ వేడుకగా ఇందిరమ్మ కానుక

**రెండో విడతగా 2.5 లక్షల ఇళ్లకు నేడు సీఎం శ్రీకారం**

**కొత్తగూడలో నేడు 25 ఇందిరమ్మ గృహ ప్రవేశాలు**

**రెండో విడతలో నియోజకవర్గానికి రెండువేల గృహాలు**

**ఆసిఫాబాద్ కొమరంబీం జిల్లాలో సీఎం రేవంత్ పర్యటన**

**రూ.112.14 కోట్ల నిధుల అభివృద్ధి పనులకు ఆరంభం**



**ఆదిలాబాద్:** తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల కానుకగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న రెండో విడత ఇందిరమ్మ గృహాలకు సోమవారం శ్రీకారం చుట్టనుంది. రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల ఇందిరమ్మ గృహాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పైలాన్ ఆవిష్కరించి లాంఛనంగా శ్రీకారం చుట్టనున్నా రు. తొలి విడతలో 4.5 లక్షల గృహాలను ప్రభుత్వం మంజూరు చేయగా వీటిలో 50 శాతం పైగా పూర్తి కాలేదు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కంరించుకుని కొమ రంభీం జిల్లా కొటారి గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తగూడలో ఆదిమ గిరిజ నులకు మంజూరు చేసి నిర్మాణం పూర్తి అయిన 25 సామూహిక గృహాలను ముఖ్య మంత్రి ప్రారంభించనున్నారు. దీంతో 46 కుటుంబాలు కలిగిన మారుమూల గిరిజన గ్రామం కొత్తగూడలో సిఎం రాక సందర్భంగా పండగ వాతావరణం నెలకొంది. సీఎం పర్యటన నేపథ్యంలో ఆగ్రామానికి సీసీ రోడ్డు, విద్యుత్ సౌకర్యంతోపాటు మిషన్ భగీరథతో సాగునీటి సౌకర్యం కల్పించారు. అవతరణ వేడుకలలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు సంక్షేమ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఆదివాసీ గిరిజనులకు వరాల జల్లు కురిపించే అవకాశం ఉంది. ఇదే జిల్లాలోని ప్రాణ హిత తీరంలో ప్రతిపాదనలో ఉన్న తుమ్మిడి హెట్టి ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి విధాన ప్రకటన చేయనున్నారు. అసెంబ్లీ నియోజకవర్గానికి 2 వేల చొప్పున ఇందిరమ్మ గృహా లు మంజూరు కానున్నాయి. అదనపు కోటా కింద ఆదిలా గిరిజన కుటుంబాలకు లబ్ధి చేకూర్చేలా ముఖ్యమంత్రి వర్గాలు ప్రకటించనున్నారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో భారీ ఎత్తున జరిగేబహిరంగసభలో పాల్గొననున్నారు. ముఖ్యమంత్రి రాక సందర్భం గా ఇంచార్జి మంత్రి జూపెల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ దండె విఠల్, రాష్ట్ర ఉన్నతాధి కారులు బహిరంగసభ ఏర్పాట్లను పరిశీలించారు. కొత్తగూడలో ముఖ్యమంత్రి ప్రారంభించే ఇందిరమ్మ గృహాలను సైతం పరిశీలించారు.

**రూ.112.14 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా రూ.112.14 కోట్ల వ్యయం తో చేపట్టే అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ముఖ్యంగా కౌటాల మండలం చింతల మానెపల్లి, రవీంద్రనగర్ క్యాంపులో 132/33 కేవీ ఉపకేంద్రానికి సీఎం శంకుస్థాపన చేయనున్నారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో రూ. 15 కోట్లతో అభివృద్ధి పనులు, కాగజ్ నగర్ మున్సిపాలిటిలో రూ. 18,70 కోట్లతో 8 చోట్ల అభివృద్ధిపనులకు, మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టనున్నారు.

**సీఎం పర్యటన షెడ్యూల్ ఇదే --**

రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా బయలుదేర్ కేరమెరి మండలం కొౌారి గ్రామ పంచా యతీలోని కొత్తగూడకి చేరుకుంటారు. అక్కడ ఆదివాసీ గిరిజన లబ్ధిదారులకు మొదటివిడత ఇందిరమ్మ కింద మంజూరైన 25 ఇండ్ల సామూహిక గృహ ప్రవేశాల లో పాల్గొంటారు. అక్కడే ఆదివాసీ గిరిజన ప్రజలతో మాట్లాడతారు. సాయంత్రం 5 గంటలకు కాగజ్నగర్ ఎక్స్ రోడ్డు లో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారు. సీఎం పర్యటన నేపథ్యంలో 1000 మంది పోలీసులతో 13 జిల్లాల నుండి ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాట్లు గా విస్తున్నారు. ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికాపంత్, ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ ఇప్పటికే బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.

# ఉచిత కరెంట్ రద్దుకు కుట్ర!

**రైతు డిస్కం కాదు.. కాంగ్రెస్ మోసం డిస్కం**

**అప్పుడు 3 గం.లు చాలని.. ఇప్పుడు 24గం.లు అంటే నమ్మాలా?**

**దమ్ముంటే 420 హామీలు అమలు చేసి ఓట్లడుగు**

**భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**హైదరాబాద్ :** రైతు డిస్కమ్ పేరుతో రైతులకిచ్చే ఉచిత విద్యుత్తు రద్దుచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఆదివారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ ముఖ్యనేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి 3గంటల విద్యుత్ చాలని పదే పదే చెప్పిన రేవంత్ రెడ్డి 24 గంటల కరెంటు ఇచ్చేందుకు రైతు డిస్కం పెడుతున్నానని చెబితే ఎవరూ నమ్మరని తేల్చిచెప్పారు. అది రైతు డిస్కం కాదని.. రైతులపాలిట యమపాశంగా మారే కాంగ్రెస్ డిస్కం అని వ్యాఖ్యానించారు. రేవంత్ చెప్పిం ది చేయడు.. చేసేది చెప్పడని ఎద్దేవా చేశారు. రైతులకు యూరి యా, కరెంట్ ఇచ్చే తెలివి లేదు.. కానీ రైతు డిస్కం పెడతాడట అని మండిపడ్డారు. నేతి బీరకాయలో నెయ్యి ఎంత ఉంటు oదో.. రైతులపై రేవంత్ రెడ్డికి అంతే ప్రేమ ఉంటదని వ్యాఖ్యా నించారు. రైతు డిస్కం పేరిట ఉచిత విద్యుత్ ఇస్తానంటే ఎవరు నమ్మరని అన్నారు. ఊళ్లలో కాంగ్రెస్ను నమ్మినందుకు గోస పడుతున్నారని తెలిపారు. ఇప్పటికే రైతులకు 34 హామీలు ఇచ్చి మోసం చేశారని విచారం వ్యక్తంచేశారు. రూ. 15వేల రై తు బంధు ఎక్కడికి పోయిందని నిలదీశారు. పరిపాలించేసత్తా లేని రేవంత్ రెడ్డి పాలనలో వ్యవస్థలన్నీ కుప్పకూలుతున్నా యని విచారం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ సర్కార్ తీసుకువచ్చిన లక్షల కోట్ల అప్పులతో ఏం చేశారో శ్వేత పత్రం విడుదల చేయా లని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డికి ఒకసిద్ధాంతం, నిర్దిష్టమై న పార్టీ లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించి చంద్రబాబు ఆదేశాలతో రాష్ట్రాన్ని పరి పాలిస్తూ మోడీతో స్నేహంగా ఉంటున్న రేవంత్ రెడ్డి అవకా శవాద రాజకీయాలకు పరాకాష్టగా నిలిచారని దుయ్యబట్టా రు. రేవంత్ రెడ్డికి దమ్ము, ధైర్యం ఉంటే ఇచ్చిన 420 హామీలను అమలు చేసిన అనంతరమే ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అడుగుతా నంటూ ప్రకటించాలన్నారు. కంటోన్మెంట్లో ఆరువేల ఇంది రమ్మ ఇండ్లను కట్టిస్తానని ఉప ఎన్నికల ప్రచారంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారని, ఆ అబద్ధాలు చెప్పి రెండేళ్లు గడిచిపోయిందని.. కనీసం ఆరు ఇండ్లు కూడా కట్ట లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ వచ్చాక ఇండ్లు కూల్చుడు తప్ప కట్టుడు లేదని విమర్శించారు. తెలిపారు. కేసీఆర్ హ యాంలో లక్షటెద్రూం ఇండ్లు నిర్మించినట్లు కేటీఆర్ గుర్తుచేశా రు. బీఆర్ఎస్ కట్టిన వాటికంటే రెండింతలు కట్టకుంటే పోటీ చేయనని పొంగులేటి అంటున్నాడని, ముందు ఆరు వేల ఇండ్లు కట్టిస్తానని చెప్పిన పొంగులేటి కనీసం ఆరు ఇండ్లయినా చూపించాలని డిమాండ్ చేశారు.

**సర్ పేరుతో బీజేపీ కుట్ర**

సర్ సర్వేతో ఓటరు లిస్టులను జల్లెడ పడుతూ కాంగ్రెస్, బీజేపీ దొంగ ఓట్లు చేర్పించుకునే ప్రయత్నం చేసే అవకాశాలు న్నాయని పార్టీ శ్రేణులను అప్రమత్తంచేశారు. అర్హులైన ప్రతి ఓటరును కాపాడుకునేందుకు పోలింగ్ బూత్లవారీగా నాయ కులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. డిఫెన్స్ ల్యాండ్లో ఉన్న 35 వేల మందికి ఓటు కల్పించే బాధ్యత తీసుకోవాలని కంటోన్మెంట్ బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. అధికారులు వినకపోతే చీఫ్ ఎలక్షన్ కమిషనర్ వద్దకు వెళ్లి పోరాడేందుకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. జూబ్లీహిల్స్లో కాంగ్రెస్ దొంగ ఓట్లు నమోదు చేయించుకోవడంతోనే బీఆర్ ఎస్ ఓడిపోయిందని తెలిపారు. మనిషికి ఒకే ఓటు ఉండేలా అప్రమత్తంగా ఉంటూ ఏజెంట్లు పనిచేయాలని సూచించారు. కేసీఆర్ సీఎం కావాలనే బలమైన అంకితభావం పార్టీ శ్రేణుల్లో, ప్రజల్లో ఉండటంతో రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ గెలుపును ఎవరూ ఆపలేరని చెప్పారు.

# రైతుకు డిస్కం ఉరి

**విద్యుత్ రంగం ప్రైవేటీకరణకే మూడో డిస్కం**

**గుజరాత్ మాదిరిగా ఇక్కడ కూడా 8 గంటలకే కుదించేందుకు కుట్ర**

**భారాస శాసనసభ పక్ష ఉపనేత హరీష్ రావు**



**సిద్దిపేట :** రాష్ట్ర ప్రభుత్వం తీసుకురానున్న 'రైతు డిస్కం' వ్యవసాయ రంగాని కి ఉరితాడుగా మారబోతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసన సభ పక్ష ఉపనేత తన్నీరు హరీష్ రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట క్యాంప్ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. రైతులకు 24 గం టల ఉచిత విద్యుత్ అందించేందుకే ఆర్పీడీసీఎల్ ఏర్పాటు చేస్తున్నా మని ముఖ్యమంత్రి చెబుతున్నది పచ్చి అబద్ధమని, పబ్లిక్ హియరింగ్లో కాంగ్రెస్ పార్టీ అధికారికంగా రైతులకు మూడు గంటల కరెంట్ చాలని చెప్పించిందని అన్నారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తేనే ఎన్నికల్లో ఓట్లు అడుగుతానని సీఎం రేవంత్ రెడ్డి ప్రమాణం చేయగలరా అని సవాల్ విసిరారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎక్కడా 13 గంటలకు మించి విద్యుత్ సరఫరా జరగడం లేదని అన్నారు. గుజ రాత్లో 7 గంటలు, కర్ణాటకలో 8 గంటల కరెంట్ మాత్రమే ఇస్తున్నా రని తెలిపారు. తెలంగాణలో కూడా రైతులకు 8 నుంచి 9 గంటల విద్యుత్కే పరిమితం చేసే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 8 ప్రకారం టీజీఆర్పీడీసీఎల్ కు అధిక శాతం రెన్యూవబుల్ ఎనర్జీ కేటాయిస్తామని పేర్కొన్నారని గుర్తుచేశారు. సోలార్ పవర్ ఉదయం నుంచి సాయంత్రం వరకు మా త్రమే అందుబాటులో ఉంటుందని, అలాంటిది కేవలం సోలార్ విద్యు త్తో 24 గంటల కరెంట్ ఇస్తామని చెప్పడం ప్రజలను మోసం చేయడ మేనన్నారు. ఈ నిర్ణయం వల్ల కాళేశ్వరం, దేవాదుల, నెటెంపాడు, కల్వకుర్తి, భీమా, కోయిల్ సాగర్, సీతమ్మసాగర్ వంటి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు ప్రమాదంలో పడతాయని హెచ్చరించారు. అలాగే మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీటి సరఫరా కూడా దెబ్బతింటుందని పేర్కొన్నారు. ఆర్పీడీసీఎల్ ఏర్పాటుతో గ్రామాల్లో ఒకే ప్రాం తంలో రెండు లైన్లు, రెండు స్తంభాలు వేయాల్సి వస్తుందని, దీని వల్ల రైతుల భూములు నష్టపోవడంతోపాటు ప్రజాధనం వృథా అవుతుం దని అన్నారు. ఇది విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించే కుట్రలో భాగమే నని ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాలు వెంటనే ఏర్పాటు చేసి ఈ అంశంపై చర్చించాలని డిమాండ్ చేశారు. డిస్కంల అప్పుల విషయంలో ముఖ్యమంత్రి చేస్తున్న ఆరోపణలు అవగాహన రాహిత్యానికి నిదర్శనమన్నారు. బీఆర్ఎస్ పాలనలో పదేళ్లకు డిస్కంలకు రూ.27 వేల కోట్లు బకాయి పడితే, కాంగ్రెస్ పాలనలో తక్కువ కాలంలోనే రూ.25,284 కోట్లు బకాయిలు పేరుకు పోయాయని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేస్తూ సబ్ స్టేషన్లు, ట్రాన్స్ ఫార్మర్లు, విద్యుత్ లైన్లను భారీగా పెంచామని పేర్కొన్నారు. తన రాజకీయ జీవితం మొత్తం బీఆర్ఎస్, కేసీఆర్తోనే ముడిపడి ఉందని హరీశ్ రావు స్పష్టం చేశారు. రైతులకు 24 గంటల విద్యుత్ ఇవ్వకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున విద్యుత్ ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

# తుదిశ్వాస వరకు బీఆర్ఎస్లోనే

**పూటకో పార్టీ మారిన నువ్వా నా గురించి మాట్లాడేది ?**

**రేపు ఏ పార్టీలో ఉంటావో తెలియదు**

**కాంగ్రెస్లో ఉండి మోడీ జపం .. బీజేపీ పాట..**

**బీఆర్ఎస్ శాసనసభ పక్ష ఉపనేత హరీష్‌రావు మండిపాటు**

**సిద్దిపేట :** 'పూటకో పార్టీ మారుతావ్.. నువ్వా నా గురించి మాట్లాడుతున్నావ్' అంటూ సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ శాసనసభ పక్ష ఉపనేత టి.హరీష్ రావు మండిపడ్డా రు. రెండు రోజులపాటు సిద్దిపేట నియోజకవర్గంలో పర్య టించిన ఆయన ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తాను పార్టీ మారే వ్యక్తి అంటూ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రేవంత్ రెడ్డి చిల్లరాయన.. ఇప్పటికీ చాలా సార్లు చిల్లర మా టలు మాట్లాడారని, ఆయన మాటకు క్రెడిబులిటీ ఉందా..? నాలుగు పార్టీలు మారి.. రోజుకు నాలుగు అబద్ధాలు మాట్లా డుతారని అన్నారు. నాలుగు వందల అబద్ధపు హామీలిచ్చి అడ్డదారిలో అధికారమెక్కిన రేవంత్ రెడ్డి పంద్రాగస్టుకల్లా రుణమాఫీ చేస్తామని దేవుడి మీద ఒట్టు పెట్టి మాట తప్పార న్నారు. ఆయిల్పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం సందర్భంగా సిద్దిపేటకు వచ్చి45 రోజుల్లో 9 వేల కోట్లు రైతుల అకౌంట్లలో రైతు బంధు డబ్బులు వేస్తామని చెప్పి మాట తప్పిన ఈ రేవ ంత్ రెడ్డి మాటలకు విలువ ఉన్నదా..? అని అన్నారు. అసలు నాలుగు పార్టీలు మారింది నువ్వు.. పూటకో పార్టీ మారి ఏఎం దకు ఆగొడుకు పట్టేవ్యక్తినా గురించి మాట్లాడటమా అని మం డిపడ్డారు. నా జీవితమంతా కేసీఆర్.. నేను బతికున్నంత కా లం బీఆర్ఎస్ అని ఎన్నోసార్లు చెప్పానన్నారు. నా పుట్టుక బీఆర్ఎస్ లోనే.. చావు కూడా బీఆర్ఎస్లోనే అని అన్నారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్లో ఉండి మోడీ, బీజేపీ పాట పాడుతు న్నారని, రేపు ఏ పార్టీలో ఉంటారో తెలియదని అన్నారు.

# విద్యాశాఖలో భారీగా బదిలీలు

**అడిషనల్ డైరెక్టర్లు, డీఈఓల మార్పు**

**తొలిసారిగా ఆన్లైన్ విధానంలో స్థానచలనం**

**కీలక బాధ్యతల్లో శ్రీహరి, రమణకుమార్, రాధారెడ్డి**

**హైదరాబాద్ డీఈఓగా యాదయ్య**

**హైదరాబాద్ :** రాష్ట్ర పాఠశాల విద్యాశాఖలో భారీఎత్తున అధికారుల బదిలీలు జరిగాయి. అడిషనల్ డైరెక్టర్లు, జాయింట్ డైరెక్టర్లతోపాటు పలు జిల్లాల విద్యాశా ధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సుదీర్ఘ కాలంగా ఎదురు చూస్తున్న సాధారణ బదిలీల ప్రక్రియను విద్యాశాఖ పూర్తి చేసింది. విద్యాశాఖలో కీలకమైన అడిషనల్ డైరెక్టర్ల విభాగంలో ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ(టాస్) డైరెక్టర్గా ఉన్న పివి శ్రీహరిని సమగ్రశిక్ష అడిషనల్ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్గా నియమించారు. రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ (టీజీఆర్ ఈఐఎస్) సెక్రటరీగా ఉన్న రమణ కుమార్ను మధ్యాహ్న భోజన పథకం (ఎండీఎం) అడిషనల్ డైరెక్టర్గా బదిలీ చేశారు. సమగ్ర శిక్షఅడిషనల్ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్గా ఉన్న రాధారెడ్డిని ప్రభుత్వ బిపాఠ్యపుస్తక ముద్రణాలయ డైరెక్టర్గా నియమించారు. అడిషనల్ డైరెక్టర్ (కో-ఆర్డినేషన్) గా ఉన్న కే. లింగయ్యను తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ డైరెక్టర్గా బదిలీ చేస్తూ ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ అదనపు బాధ్యతలు అప్పగించారు. మధ్యాహ్నభోజన పథకం (ఎండీఎం) ఆడిషనల్ డైరెక్టర్గా ఉన్న జి. ఉషారాణిని రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ సెక్రటరీగా బదిలీ చేశారు. తొలిసారిగా అడిషనల్ డైరెక్టర్ స్థాయి నుంచి ఆఫీస్ సబార్డినేట్ వరకు మొత్తం 9 కేటగిరీల బదిలీలను ఆన్లైన్ విధానంలో చేపట్టినట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ ఇ. నవీన్ నికోలస్ తెలిపారు. జిల్లా, జోనల్, స్టేట్ క్యాడర్ పరిధిలోని అన్ని బదిలీలను పారదర్శకంగా పూర్తి చేశామని ఆయన పేర్కొన్నారు.

**ముగ్గురు డీఈఓలు బదిలీ**

జిల్లా విద్యాశాఖాధికారుల బదిలీల్లో భాగంగా మంచి ర్యాల డీఈఓ వై. యాదయ్యను హైదరాబాద్ డీఈఓగా నియమించారు. హై దరాబాద్ డీఈఓ ఆర్.రోహిణిని సంగారెడ్డికి, సంగారెడ్డి డీఈఓ వెంకటేశ్వర్లును రంగారెడ్డి జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

**ఏడుగురు జాయింట్ డైరెక్టర్లకు స్థానచలనం**

తెలంగాణ ఓపెన్ స్కూల్ ఆర్ జేడీ సోమిరెడ్డిని హైదరా బాద్ రీజినల్ జాయింట్ డైరెక్టర్గా నియమించారు. హైదరాబాద్ ఆర్జేడీ విజయలక్ష్మిని వరంగలు బదిలీ చేశారు. పి.రాజీవ్ (జేడీ టాస్), కె.సత్యనారాయణ రెడ్డి (జేడీ, మోడల్ స్కూల్స్), పి.మదన్మోహన్ (జేడీ-1, సమగ్ర శిక్ష), బి.వెంకటనరసమ్మ (జేడీ- సర్వీస్) తదితరులకు కొత్త బాధ్యతలు అప్పగించారు.

# విద్యుత్ ప్రైవేటీకరణకే రైతు డిస్కం

**కాదని సీఎం ప్రెస్ మీట్ పెట్టి చెప్పగలరా?**

**ఉచిత విద్యుత్కు ఎసరు.. మోటార్లకు మీటర్లు పెట్టేందుకే ప్లాన్**

**కొత్త డిస్కంపై కోర్టులో కేసు వేశాం..**

**అవసరమైతే సుప్రీంకు వెళ్తాం: టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత**



**హైదరాబాద్ :** రాష్ట్రంలో రైతు డిస్కం పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొత్త డ్రామాకు తెరలేపి oదని, దీని వెనుక విద్యుత్ రంగాన్ని ప్రైవేటు పరం చేసే కుట్ర దాగి ఉందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుం ట్లకవిత ఆరోపించారు. రైతు డిస్కం ఏర్పాటు చేయడం వెనుక అసలు ఉద్దేశం.. ఉచిత విద్యుత్ పథకానికి మంగ ళం పాడటమేనని అన్నారు. రైతుల కోసం ప్రత్యేక డిస్కం ఏర్పాటు చేసి, మిగిలిన రెండు డిస్కంలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోందని మండిపడ్డారు. ఆదివారం హైదరా బాద్లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడి యా సమావేశంలో ఆమె మాట్లాడుతూ సీఎం రేవం త్రెడ్డి మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ చేస్తూ ఉచిత విద్యుత్ తీసేయమని, మీటర్లు పెట్టమని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అదే మాటను అధికారి కంగా ప్రెస్ మీట్ పెట్టి ప్రజలకు చెప్పే ధైర్యం ముఖ్య మంత్రికి ఉందా అనికవిత ప్రశ్నించారు. ఎన్నికలముం దు ఇచ్చిన హామీలనే అమలు చేయని ఈ ప్రభుత్వం, ఇప్పుడు చెబుతున్న మాటలను నమ్మలేమన్నారు. రైతు డిస్కం ప్రతిపాదనను ఈఆర్సీ తక్షణమే తిరస్క రించాలని డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాలకు భంగం కలిగించే ఈ నిర్ణయంపై రాష్ట్రంలోని 33 జిల్లా ల్లో పబ్లిక్ హియరింగ్ నిర్వహించి రైతుల అభిప్రాయా లను తీసుకోవాలన్నారు. ఇప్పటికే తెలంగాణ జాగృతి తరఫున దీనిపై కోర్టులో కేసు వేశామని, ఒకవేళ ప్రభు త్వం మొండిగా ముందుకు వెళ్తే సుప్రీంకోర్టుకు వెళ్లైనా అడ్డుకుంటామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యుత్ సంస్కరణలకు రేవంత్ సర్కార్ వత్తాసు పలుకుతోందని కవిత ఆరోపించారు. సోలార్ ప్యానెల్స్, బ్యాటరీల తయారీలో చిన్న తరహా పరిశ్రమలను దెబ్బతీస్తూ, అదానీ, రిలయన్స్ వంటి బడా సంస్థలకు లాభం చేకూర్చేలా కేంద్రం కొత్త జీవోలు తెచ్చిందని, దానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తోందని మండిపడ్డారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులను దసరా లోపు ప్రారంభించాలని కవిత డిమాండ్ చేశారు. ఒ కవేళ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే, దసరా మరుసటి రోజు నుంచే తాను పాదయాత్ర చేపడతామన్నారు. అలాగే ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం వల్ల చేయి కోల్పోయిన పసిబిడ్డ కుటుంబానికి రూ. 25 లక్షల ఎక్స్రేషియా ప్రకటించాలని, కుమ్మెర గ్రామం లో కుల వివక్షతో హత్యకు గురైన దళిత బిడ్డ కుటుంబానికి న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

# దక్షిణ కోస్తా జోన్లోకి మధిర!

**నేటి నుంచి అమలులోకి వస్తున్న ఉత్తర్వులు**

**ఇకపై రైల్వే కార్యకలాపాలన్నీ విజయవాడ డీఆర్ఎం పరిధిలోనే**

**మధిరను ప్రాంతీయ రైల్వేగా తీర్చిదిద్దాలని స్థానికుల డిమాండ్**

**మధిర :** ఖమ్మం జిల్లాలోని ప్రముఖ రైల్వే కేంద్రంగా గుర్తింపు పొందిన మధిర రైల్వే స్టేషన్ జూన్ 1 నుంచి అధికారికంగా దక్షిణ మధ్య రైల్వే పరిధి నుంచి విడిపోయి దక్షిణ కోస్తా రైల్వేజోన్ పరిధిలోకి చేరింది. కేంద్ర ప్రభుత్వం విశాఖపట్నం. కేంద్రంగా ఏర్పాటు చేసిన దక్షిణ కోస్తా రైల్వేజోన్ అమలులో భాగంగా ఈ మార్పు చోటుచేసుకుంది. సికింద్రా బాద్ - విజయవాడ డివిజన్ల సరిహద్దులోని మధిర మండలం బయ్యారం గ్రామం వద్ద525వ కిలోమీటర్ వద్ద 'దక్షిణ కోస్తా రైల్వేకు స్వాగతం' బోర్డును రైల్వే అధికారు లు ఏర్పాటు చేయడం ద్వారా కొత్త జోన్ సరిహద్దులను స్పష్టంగా గుర్తించారు. ఆం ధ్రప్రదేశ్లోని కొండపల్లి నుంచి తెలంగాణ రాష్ట్రంలోని మధిర సమీపంలో ఉన్న బయ్యారం గ్రామం వరకు సుమారు 46 కిలోమీటర్ల మేర ఉన్న రైల్వే మార్గం, ఆ పరిధిలోని స్టేషన్లు ఇకపై దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఆధ్వర్యంలో కొనసాగనున్నాయి. ఈ మార్పుతో 60 సంవత్సరాలపాటు సౌత్ సెంట్రల్ రైల్వే పరిధిలో ఉన్న మధిర రైల్వే స్టేషన్ ఇకనుంచి పరిపాలనా పరంగా విజయవాడ డివిజన్తో అనుసంధాన మైంది. రైల్వే నిపుణుల అభిప్రాయం ప్రకారం, భౌగోళికంగా విజయవాడకు సమీ పంగా ఉండే మధిరకు ఈ మార్పువల్లపరిపాలనా నిర్ణయాలు వేగవంతం కావడంతో పాటు అభివృద్ధి పనులు త్వరితగతిన జరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.

**ఇకపై విజయవాడే కేంద్రం**

ఇప్పటి వరకు రైల్వేకు సంబంధించిన సమస్యలు, అభివృద్ధి పనులు, ప్రయా ణికుల సౌకర్యాల కోసం ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు, ప్రజలు సికింద్రాబాద్ లోని దక్షిణ మధ్య రైల్వే కార్యాలయాలను ఆశ్రయించేవారు. కొత్తజోన్ అమలులోకి రావడంతో ఇకపై విజయవాడలోని డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్ఎం) కార్యాల యాన్ని సంప్రదించాల్సి ఉంటుంది. దీంతో మధిర ప్రాంత ప్రజలకు రైల్వే అధికారు లతో ప్రత్యక్షంగా సంప్రదింపులు జరపడం మరింత సులభతరం కానుందని భావి స్తున్నారు. కొండపల్లి నుంచి మోటమర్రి వరకు విధులు నిర్వహిస్తున్న రైల్వే ఉద్యో గులంతా ఇకపై దక్షిణ కోస్తా రైల్వే పరిపాలనా నియంత్రణలో పనిచేయనున్నారు. ఉద్యోగుల బదిలీలు, పరిపాలనా ఉత్తర్వులు, సిబ్బంది నిర్వహణ తదితర అంశాలు కొత్త జోన్ ఆధ్వర్యంలో కొనసాగనున్నాయి. దక్షిణ మధ్య రైల్వే నుంచి దక్షిణ కోస్తా రైల్వే జోన్కు మధిర స్టేషన్ మారడం కేవలం పరిపాలనా మార్పు మాత్రమే కా కుండా, భవిష్యత్ అభివృద్ధికి కొత్త అవకాశాల ద్వారం తెరిచిన కీలక పరిణామంగా స్థానిక ప్రజలు, రైల్వే ప్రయాణికులు భావిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని మధిరను ప్రాంతీయ రైల్వే హబ్ గా తీర్చిదిద్దాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

# మీకు మామిడి పండ్లే ముఖ్యమా..?

## మోడీపై రాహుల్ ఫైర్



**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ నాయకుడు, లోక్సభలో ప్రతిపక్షనాయకుడు రాహుల్ గాంధీ సీబీఎస్ఈ ఆన్ స్క్రీనింగ్ మార్కింగ్ (ఓఎస్ఎం) వివాదంపై మరోసారి కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. తమ జవాబు పత్రాలపై అభ్యంత రాలు వ్యక్తం చేసిన విద్యార్థు లతో తాను జరిపిన సంభాషణ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ ఆయన దేశ ద్రోహులైన సోరోస్ ఏజెంట్లతో సంభాషించి నట్లు వ్యంగ్యంగా పేర్కొన్నారు. 18.5 లక్షల మంది విద్యార్థుల కంటే మీకు మామిడి పండ్లే ముఖ్యమా అని ప్రధానమంత్రి మోడీని విమర్శించారు. మోడీ ఆదివారం నాటి మన్కీ బాత్లో వివిధ రాష్ట్రాలలోని మామిడి పండ్ల గురించి మాట్లాడారు కానీ, సీబీఎస్ఈ ఓఎస్ఎంలో జరిగిన పొరపాట్లపై మాట్లాడక పోవడాన్ని దుయ్యబట్టారు. ఇటీవల చాలా మంది విద్యార్థులు ఫిర్యాదు చేయడంతో వివాదం పెద్దదయింది. దీనిపై విద్యార్థులతో రాహుల్ గాంధీ ఆన్లైన్లో మాట్లాడుతూ జవాబు పత్రాలు అడిగిన విద్యార్థులను దేశ ద్రోహులుగా, డీప్ స్టేట్ ఏజెంట్లుగా, ఉగ్రవాదులుగా చిత్రీకరిస్తున్నారని అన్నారు. సమస్యను అంగీకరించి పరిష్కరించాల్సిన ప్రభుత్వం విద్యార్థులపై నిందలు వేస్తోందని ఆరోపించారు. ఆ వీడియోలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మిమ్మల్ని కూడా ఉగ్రవాదులు అని పిలిచారా? అని అడిగారు. సీబీఎస్ఈ ఓఎస్ఎం ప్రక్రియను నిర్వహించిన కోవిన్ఫ్ట్ సంస్థను కూడా రాహుల్ గాంధీ విమర్శించారు. గతంలో గ్లోబరీనా పేరుతో వివాదాల్లో చిక్కుకున్న ఈ కంపెనీకి కాంట్రాక్టు ఎలా ఇచ్చారో వెల్లడించాలని డిమాండ్ చేశారు.

# నేడు బెంగాల్ మంత్రివర్గ విస్తరణ

## ప్రమాణ స్వీకారం చేయనున్న 35 మంది కొత్త మంత్రులు


## 11 గంటలకు సచివాలయంలో కార్యక్రమం



**కోల్కతా:** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి ఆదివారం తన ప్రభు త్వంలో భారీ విస్తరణను ప్రకటించారు. సోమవారం 35 మంది కొత్త మంత్రులు ప్రమా ణ స్వీకారం చేయనున్నట్లు తెలిపా రు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం గా ఉదయం 11 గంటలకు రాష్ట్ర సచివాల యమైన నబన్నాలో జరగనుంది. గవర్నర్ ఆర్. ఎన్. రవి కొత్త మంత్రులతో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. కొత్త మంత్రివర్గంలో బీజేపీకి చెందిన సీనియర్ నాయకులకు కీలక శాఖలు కేటాయిస్తారని భావిస్తున్నారు. మే 9న జరిగిన ప్రమాణ స్వీకారంలో ముఖ్యమంత్రి సువేందు అధికారితో పాటు నలుగురు మంత్రులు మాత్రమే ప్రమాణం చేశారు. తాజా విస్తరణతో మంత్రుల సంఖ్య 39కు పెరగనుంది. మే 18న మంత్రి వర్గ సమావేశంలో సంస్థాగత అవినీతి, మహిళలపై జరుగు తున్న అకృత్యాలను విచారించడానికి రెండు కమీషన్ల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ఈ రెండు కమిషన్లు కూడా సోమవారం నుండి తమ పనిని ప్రారంభిస్తాయని సువేందు అధికారి తెలిపారు.

# ట్రంప్ హెల్త్ ఎక్సెలెంట్

## మెడికల్ రిపోర్ట్ విడుదల చేసిన వైట్ హౌస్



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల వాల్టర్ రీడ్ ఆసుపత్రిలో పూర్తి ఆరోగ్య పరీక్ష చేయించుకున్నారు. వైద్యులు ఆయన ఆరోగ్యం అత్యంత మంచి స్థితిలో ఉందని ప్రకటించారు. గుండె, ఊపిరితిత్తులు, మెదడు, మొత్తం శరీర వ్యవస్థలు బలంగా ఉన్నాయని చెప్పారు. అన్ని పరీక్షల ఫలితాలు సాధారణ పరిధుల్లోనే ఉన్నాయి. ఆయన వయసు 80 సంవత్సరాలు దగ్గరలో ఉన్నా కూడా అధ్యక్షుడిగా అన్ని బాధ్యతలు నిర్వహించడానికి పూర్తిగా సమర్థుడని వైద్యులు తెలిపారు. మెదడు సామర్థ్య పరీక్షలో ముప్పైలో ముప్పై పాయింట్లు సాధించారు. రక్తపోటు, ఇతర ప్రాథమిక సూచికలు సాధారణంగా ఉన్నాయి. అయితే ఆయన బరువు పెరిగింది. గత పరీక్షతో పోలిస్తే 6.3 కేజీలు ఎక్కువగా ఉంది. ప్రస్తుతం ఆయన బరువు దాదాపు 108 కేజీలుగా ఉంది. కాళ్లలో కొంచెం వాపు ఉంది. చేతులపై చిన్న గాయాలు కనిపించాయి. ఇవి ఎక్కువగా కరచాలనం చేయడం వల్ల వచ్చినవని వైద్యులు చెప్పారు. ట్రంప్ను బరువు తగ్గించుకోవాలని సూచించారు. ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలని, ఎక్కువ వ్యాయామం చేయాలని సలహా ఇచ్చారు. ఆహార నియంత్రణ, శారీరక శ్రమ పెంచడం ద్వారా బరువు తగ్గించుకోవాలని సూచించారు. ఈ మేరకు వైట్ హౌస్ ఒక ప్రకటన విడుదల చేసింది.

# ఎండల్లో జాగ్రత్త

**పానకం, మజ్జిగ, సాంబారుతో ఉపశమనం**

**దేశీయ పానీయాలను సేవించండి**

**బంగినపల్లి, సువర్ణ రేఖ రుచి అద్భుతం**

**భిన్నత్వంలో ఏకత్వానికి మామిడి నిదర్శనం**

**దేశ ఆర్థిక వ్యవస్థకు మామిడి రైతులు కీలకం**

**మన్కి బాత్ లో ప్రధాని మోడీ వెల్లడి**



**న్యూఢిల్లీ:** వేసవికాలంలో జాగ్రత్తలు నుంచి అదే కాలంలో లభించే రకరకాల పానీయాలు, మామిడిపండ్లు, నెదర్లాండ్స్ నుంచి తిరిగి తెప్పించుకున్న భారతీయ పురాతన రాగి ఫల కాలు, ఖగోళ శాస్త్ర పరిశోధనల్లో భారతీయుల ముందంజ, యూపీలో ఒక డాల్ఫిన్ను కాపాడటంలో భారతదేశపు మొట్టమొదటి డాల్ఫిన్ అంబులెన్స్, తదితర విషయాలను ఆదివారంనాటి మన్కి బాత్లో లో ప్రధాని మోడీ ప్రస్తావించారు.

### ఎండల్లో జాగ్రత్త ముఖ్యం

ప్రస్తుతం దేశంలోని చాలా ప్రాంతాల్లో చాలా వేడిగా ఉంది. తీవ్రమైన ఎండతో పాటు వేడి గాలులు వీస్తున్నాయి. ఇలాం టి వాతావరణంలో మిమ్మల్ని మీరు జాగ్రత్తగా చూసుకో వడం చాలా ముఖ్యం. నీళ్లు తాగుతూ ఉండండి. ఒకవేళ తప్పనిసరిగా ఎండలోకి వెళ్లాల్సి వస్తే జాగ్రత్తగా ఉండండి. ఈ విషయంలో వివిధ ప్రభుత్వ శాఖలు జారీ చేసిన మార్గదర్శకాలను మర్చిపోవద్దు అని ప్రధాని తెలిపారు. వేడిని తట్టుకునే మార్గం వంటగదిలోనే వేడిని తట్టుకునే మార్గం తరచుగా వంటగదిలోనే దొరుకుతుంది. కొన్ని చోట్ల మట్టి కుండలోని నీరు పొంగిపొర్లుతుంది. మరికొన్ని చోట్ల పెరుగు గడ్డకడుతుంది. పచ్చి మామిడికాయలు ఉడకడం మొదలవుతుంది. మీరు ఉత్తర భారతదేశానికి వెళితే అనేక చోట్ల ఆమ్ పన్నా కనిపిస్తుంది. ఇది వేడి నుండి ఉపశమనాన్ని కూడా ఇస్తుంది. పంజాబ్, హర్యానాలకు వెళితే లస్సీ మీకు కనిపిస్తుంది. రాజస్థాన్, గుజరాత్లలో మజ్జిగ ప్రతి భోజనానికి తోడుగా ఉంటుంది. బీహార్, జార్ఖండ్, తూర్పు ఉత్తరప్రదేశ్ సత్తు షర్బత్ చాలా అద్భుతంగా ఉంటుంది. ఆదిశక్తినిస్తుంది. కొంకణ్, గోవాలలో కోకుమ్ షర్బత్, సోల్ కఢి దొరుకుతాయి. దక్షిణ భారతదేశపు పానకం, నీర్ మోర్, సాంబారు; ఒడిశాలో లభించే బేల్ పానా కేవలం పానీయాలు మాత్రమే కాదు. అవి భారతదేశంలోని వివిధ ప్రాంతాల సంప్రదాయాలలో ఒక భాగం. అవి ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ స్ఫూర్తిని కూడా ప్రతిబిం బిస్తాయి. ఒక విషయం గుర్తుంచుకోవాలి. నీటిలో చాలా వరకు మన వంటగదుల నుండి, మన పొలాల నుండి, పశువుల కొట్టాల నుండి వచ్చాయి. వీటికి పెద్ద బ్రాండింగ్ ఏమీ లేదు. కానీ అవి తరతరాల అనుబంధాన్ని ప్రతిబిం దిస్తాయి. మీరు కూడా వేసవిలో ఈ దేశీయ పానీయాలను ఆస్వాదించాలి అని మోడీ పిలుపునిచ్చారు.

### దేశమంతటా మామిడి రుచి, సువాసన

భారతదేశంలో వేసవి కాలంలో మామిడిపండ్ల ప్రస్తావన రాని ఇల్లు దాదాపుగా ఉండదు. ఒక్కో ప్రాంతానికి ఒక్కో మామిడి రకం, ఒక్కో రుచి, ఒక్కో సువాసన ఉంటాయి. మహారాష్ట్ర, కొంకణ్ ప్రాంతాల నుండి హాపుస్, అల్ఫోన్సోరకాలుంటాయి. గుజరాత్ నుండి కేసర్- ఇవైతే మామిడి రసానికి ప్రాణం. ఉత్తర ప్రదేశ్ నుండి దశహరి; ఇక కాశీ నుండి లంగ్రా, యాదృచ్ఛికంగా లంగ్రా మామిడి పండ్లకు ఒక ప్రత్యేక గుణం ఉంది. పండిన తర్వాత కూడా వాటి రంగు తరచుగా ఆకుపచ్చగానే ఉంటుంది. బీహార్ నుండి జర్దాలూ సువాసనను దూరం నుంచే గుర్తించవచ్చు. చౌసా, మాల్డా ఇలా ప్రతి పేరుతో ముడిపడిన జ్ఞాపకాలు ఉన్నాయి. దక్షిణ భారతదేశానికి వెళితే బంగినపల్లె, తోతాపురి, నీలం, మాల్గోవా రకాలుంటాయి. బెంగాల్ నుండి హిమసాగర్: ఒడిశా, ఆంధ్రప్రదేశ్ నుండి సువర్ణరేఖ ఉన్నాయి. మామిడి పండ్ల ఈ ప్రయాణం ఇప్పుడు పల్లెటూరి నుండి ప్రపంచ మార్కెట్ కు చేరుకుంటోంది. మామిడి రైతులను నేను ప్రశంసిస్తున్నాను. మీరుకేవలం సాధారణ రైతులు కాదు- దేశవ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు మీరు చాలా ప్రత్యేకమైనవారు అని ప్రధాని కొనియాడారు.

# 3న నిరాడంబరంగా డీకే ప్రమాణం

**లోకభవన్లో కొద్ది మంది సమక్షంలో కార్యక్రమం**

**ఇంటెలిజెన్స్ హెచ్చరిక, స్వామీజీల జోస్యం**

**సిద్ధరామయ్య అనుచరుల వ్యతిరేకతే కారణాలు**

**అదే రోజు బెంగళూరులో కాంగ్రెస్‌భవన్‌కు శంకుస్థాపన**



**బెంగళూరు:** రాష్ట్ర ముఖ్యమంత్రి కావాలనే డీకే శివకుమార్ దశాబ్దాల కల నెరవేరుతోంది. అయితే ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిరాడంబరంగా నిర్వహించాల్సి వస్తోంది. దీంతో కార్యకర్తలు, అభి మానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఇంటెలిజెన్స్ నివేదికతో పాటు దీని వెనుక మరికొన్ని కారణాలు ఉన్నట్లు చెబుతున్నారు. విధాన సౌధ వద్ద పెద్ద ఎత్తున హంగామాతో ప్రమాణ స్వీకారం చేయాలనుకన్న డీకే శివకుమార్ కల చివరి నిమిషంలో లోక భవన్ ప్రాంగణానికి మారింది. ఆయన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భారీ సంఖ్యలో మద్దతుదారులు, అభి మానులు, పార్టీ కార్యకర్తలు హాజరవుతారని అంచనా వేస్తున్న నేపథ్యంలో నిఘా సంస్థ ఇచ్చిన ముందు జాగ్రత్తనివేదిక ఆధారంగా ఈ కార్యక్రమాన్ని మార్చి నట్లు చెబుతున్నారు. గత ఏడాది ఆర్సీబీ విజయోత్స వ వేడుకల సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘట నను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు.

### ఇతర కారణాలు

భక్తుడైన డీకేశివకుమార్కు ప్రమాణ స్వీకారాన్ని నిరా డంబరంగా నిర్వహించాలని నోనవినకెరె అజ్జయ్యన్ పీఠం నుంచి సూచనలు అందాయని చెబుతున్నారు. అక్కడున్న స్వామీజీలు కూడా ఎలాంటి ఆర్భాటం ఉండకూడదని జోస్యం చెప్పినట్లు తెలుస్తోంది. ప్రమాణస్వీకారం రోజైన జూన్ 3న భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ కూడా సూచించింది. మరోవైపు సిద్ధారమయ్య సీఎం పదవికి రాజీనామా చేయడం ఆయన అభిమానులను కలవరపరిచింది. దీనివల్ల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో సిద్ధరామయ్య అభిమానులు నిరసన తెలిపే అవకాశం ఉంది. అయితే పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయని, దీనివల్ల సుదూర ప్రాంతాల నుంచి వచ్చే అభిమానుల ఖర్చులు పెరుగుతాయని, అందుకే ఆర్భాటం చేసే బదులు కార్యక్రమాన్ని నిరాడంబరరంగా నిర్వహిస్తు న్నామని కేపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తెలిపారు.

### కాంగ్రెస్ భవనకు శంకుస్థాపన

డీకే శివకుమార్ ప్రవ ప్రమాణ స్వీకారం చేసిన రోజే బెంగళూరులోని రేస్ కోర్స్ సమీపంలో కొత్త కాంగ్రెస్ భవనకు శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆదివారం రోజు శివకుమార్ ఆ స్థలాన్ని స్వయంగా పరిశీలించారు. లోకభవన్లో ప్రమాణ స్వీకారం చేసిన తరువాత ఇక్కడ జరిగే శంకుస్థాపన కార్యక్రమానికి పార్టీకి చెందిన బ్లాక్ అధ్యక్షులు, డీసీసీ అధ్యక్షులు, ఫ్రంట్లైన్ ఆర్గనైజేషన్ అధిపతులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, కార్పోరేషన్ బోర్డుల చైర్మన్లు, శాసనమండలి సభ్యులు పాల్గొంటారని, అయితే ప్రజలకు అనుమతి లేదని శివకుమార్ తెలిపారు

# ఢిల్లీలో కుప్పకూలిన భవనం

## ఆరుగురు మృతి, 10 మందికి గాయాలు

## ఇద్దరు ఇంజినీర్లపై వేటు

**న్యూఢిల్లీ:** దేశరాజధానిలోని సాకేత్ మెట్రో స్టేషన్ సమీపంలోని సైదులాజాబ్ ప్రాంతంలో ఒక బహుళ అంతస్తుల వాణిజ్య భవనం కూలిపోయింది. ఈ ఘటనలో మరణాల సంఖ్య ఆరుకు పెరిగింది. 10 మంది గాయపడ్డారు. శనివారం సాయంత్రం ఈ దుర్ఘటన జరిగింది. భవనంలో కోచింగ్ సెంటర్లు, కేఫ్లు, కార్యాలయాలు, విద్యార్థుల వసతి గృహాలు ఉన్నాయి. పై అంతస్తులో నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో భవనం కూలిపోయింది. మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు ఈ ఘటనపై చర్యలు తీసుకున్నారు. ఇద్దరు మునిసిపల్ ఇంజనీర్లను సస్పెండ్ చేశారు. అసిస్టెంట్ ఇంజనీర్ సుదేశ్ సింగ్ చౌహాన్, జూనియర్ ఇంజనీర్ అమన్ జైన్లను వెంటనే సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. వారు భవనం పర్యవేక్షణలో విధులు నిర్వర్తించడంలో నిర్లక్ష్యం చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు. మేజిస్టీరియల్ విచారణకు ఆదేశాలు ఇచ్చారు. ముఖ్యమంత్రి రేఖా గుప్తా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. ఎన్ఆర్ఎఫ్, ఫైర్ సర్వీసెస్, పోలీసులు కలిసి పని చేస్తున్నారు. గాయపడినవారిని ఆసుపత్రుల్లో చేర్చి చికిత్స అందిస్తున్నారు.

# మీరు తప్పు చేశారు

## ఆస్పత్రి సీఈఓపై దీదీ ఫైర్

## దాడి తర్వాత ఆస్పత్రిలో అభిషేక్ బెనర్జీ



కోల్కతా: పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ బెల్ వ్యూ ఆసుపత్రి సీఈఓ ప్రదీప్ టాండన్ ను తీవ్రంగా దూషించిన వీడియో క్లిప్ బయటపడింది. ఆ క్లిప్లో మమతా బెనర్జీ సీఈఓను చూసి మీరు తప్పు చేశారు అని అంటూ కోపంగా మాట్లాడి న వైనాన్ని వినవచ్చు. ఈ ఘటన ఆమె మేనల్లుడు, ఎంపీ అభిషేక్ బెనర్జీ సోనార్పూ ర్లో దాడికి గురైన తర్వాత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో జరిగింది. ఆసుపత్రి అధికారులు తగిన విధంగా పని చేయలేదని మమతా బెనర్జీ ఆరోపించారు. మీరు అహంకారంతో ప్రవర్తిస్తున్నారు అని క రీడా చెప్పినట్లు క్లిప్ లో వినవచ్చు. ఈ వీడియోను భారతీయ జనతా పార్టీ నాయకులు సోషల్ మీడియాలో షేర్ చేసి రాజకీయ వివాదాన్ని రేపారు. ఈ వీడియో లీక్ అయిన తర్వాత పశ్చిమ బెంగాల్లో లో పెద్ద చర్చ జరుగుతోంది. భారతీయ జనతా పార్టీ నాయకులు ఇది మమతా బెనర్జీ అహంకారం అని విమర్శించారు. ఈ సంఘటన రాజకీయ వేడిని మరింత పెంచింది. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఈ దాడిని బీజేపీ మద్దతుతో జరిగిన అసంఘటిత దాడి అని ఆరోపించింది. అభిషేక్ బెనర్జీ తాను చావుకు గురవుతానని భయపడ్డానని చెప్పారు. మమతా బెనర్జీ కూడా బీజేపీని నిందించి పాలకులు హంతకుల య్యారని వ్యాఖ్యానించారు. బీజేపీ ఈ ఆరోపణలను తిరస్కరించింది. ఈ దాడి తృణమూల్ కాంగ్రెస్ అంతర్గత కలహాల వల్ల జరిగిందని చెప్పింది. స్థానికజనం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు బీజేపీ నాయకులు అన్నారు.

# రాయల్స్ అ'ద్వితీయ'ం

## బెంగళూరుదే ఐపీఎల్ ట్రోఫీ
## వరుసగా రెండో టైటిల్ సొంతం
## ఫైనల్లో గుజరాత్‌పై ఘనవిజయం
## అదరగొట్టిన విరాట్ కోహ్లీ



**సుదీర్ఘ నిరీక్షణకు తెర దించి గతేడాది తొలి ఐపీఎల్ కప్‌ను ముద్దాడిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు నుంచి మరో అ'ద్వితీయ' షో. గుజరాత్ టైటాన్స్‌తో ఫైనల్‌కు ముందు సమవుజ్జీల పోరుగా భావించినా.. తాము బరిలోకి దిగితే వార్ వన్‌సైడే అని రజత్ సేన నిరూపించింది. ఆర్‌సీబీ బౌలర్ల ధాటికి అతికష్టంగా 150 పరుగులు దాటిన టైటాన్స్‌కు ఫలితమేంటో ముందే తెలిసొచ్చింది. అనంతరం ఛేజింగ్ రారాజు విరాట్ కోహ్లీ అజేయ హాఫ్ సెంచరీతో కడదాకా నిలిచి, బెంగళూరు వరుసగా రెండోసారి కప్‌ను ముద్దాడేలా చేశాడు. అటు బెంగళూరు ఫ్యాన్స్ 'ఈ సాలనూ కప్ నమ్దే' అంటూ విజయ సంబరాలతో మైమరిచిపోయారు. ఇక క్వాలిఫయర్2లో చూపిన పోరాట పటిమను సొంత గడ్డపై పునరావృతం చేయలేక గిల్ సేన నిరాశలో మునిగింది.**

అహ్మదాబాద్: ఐపీఎల్-19వ సీజన్‌లోనూ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు విజేతగా నిలిచింది. ఆదివారం గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఏకపక్ష ఫైనల్లో ఆర్‌సీబీ 5 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. విరాట్ కోహ్లీ (42 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 75 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఆర్‌సీబీకిది వరుసగా రెండో టైటిల్ కాగా.. అటు 2022లో తొలిసారి విజేతగా నిలిచిన గుజరాత్ ఫైనల్లో ఓడడం ఇది రెండోసారి. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 155 పరుగులు చేసింది. సుందర్ (37 బంతుల్లో 5 ఫోర్లతో 50 నాటౌట్), నిశాంత్ (18 బంతుల్లో 3 ఫోర్లతో 20), బట్లర్ (23 బంతుల్లో 1 ఫోర్‌తో 19) మాత్రమే రాణించారు. రసిఖ్‌కు మూడు.. భువనేశ్వర్, హాజెల్‌వుడ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో బెంగళూరు 18 ఓవర్లలో 5 వికెట్లకు 161 పరుగులు చేసి గెలిచింది. వెంకటేశ్ అయ్యర్ (16 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 32), డేవిడ్ (17 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 24) వేగం చూపారు. రషీద్‌కు రెండు వికెట్లు దక్కాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా విరాట్ కోహ్లీ, 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా వైభవ్ సూర్యవంశీ నిలిచారు.

### విరాట్ అజేయంగా..

స్వల్ప ఛేదనను ఆర్‌సీబీ మెరుపు వేగంతో ఆరంభించింది. ఓపెనర్ విరాట్ కోహ్లీ కీలక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. మధ్య ఓవర్లలో వేగంగా వికెట్లు కోల్పోయినా తను మాత్రం చివరి వరకు ఓపిగ్గా క్రీజులో నిలిచాడు. అలాగే లక్ష్యం తక్కువే కావడంతో ఆర్‌సీబీకి కూడా ఎలాంటి ఇబ్బంది ఎదురుకాలేదు. తొలి ఓవర్‌లో సిరాజ్ ఐదు పరుగులే ఇచ్చినా ఆ తర్వాత ఆర్‌సీబీ దూసుకెళ్లింది. రెండో ఓవర్‌లో మరో ఓపెనర్ వెంకటేశ్ అయ్యర్ 4,6,4,4తో 18 రన్స్.. నాలుగో ఓవర్‌లో విరాట్ 4,4,6,4తో 19 రన్స్ రాబట్టడంతో జట్టు స్కోరు 4 ఓవర్లలోనే 55 పరుగులకు చేరింది. అయితే జోరు మీదున్న అయ్యర్‌ను సిరాజ్ అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 27 బంతుల్లో 62 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అటు దేవ్‌దత్ (1)ను రబాడ పెవిలియన్‌కు చేర్చడంతో పవర్‌ప్లేలో జట్టు 70/2తో పటిష్ట స్థితిలో నిలిచింది. ఆ తర్వాత పరుగుల జోరు నెమ్మదించింది. దీనికి తోడు స్పిన్నర్ రషీద్ 9వ ఓవర్‌లో రజత్ (15), క్రునాల్ (1) వికెట్లు తీయడంతో గుజరాత్‌లో జోష్ కనిపించింది. కానీ విరాట్ నిలకడగా క్రీజులో నిలిచాడు. అడపాదడపా బౌండరీలతో జట్టును విజయం దిశగా నడిపించాడు. అలాగే ఓ ఫోర్‌తో 25 బంతుల్లోనే తన ఐపీఎల్ కెరీర్‌లో ఫాస్టెస్ట్ ఫిఫ్టీని పూర్తి చేశాడు. టిమ్ డేవిడ్ ఉన్న కాసేపు వేగంగా ఆడి 14వ ఓవర్‌లో వెనుదిరిగాడు. అప్పటికి ఆరు ఓవర్లలో 24 పరుగులే అవసరం కావడంతో మ్యాచ్ ఫలితమేమిటో తెలిసిపోయింది. 16వ ఓవర్‌లో విరాట్ క్యాచ్‌ను గిల్ అందుకున్నా.. డైవింగ్ సమయంలో బంతి నేలకు తాకడంతో నాటౌట్‌గా ప్రకటించారు. ఆ తర్వాత జితేశ్ (11 నాటౌట్) సహాయంతో విరాట్ 4,6తో మరో 12 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించాడు.

### బౌలర్లదే పైచేయి

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ పరుగుల కోసం అల్లాడింది. అటు ఆర్‌సీబీ బౌలర్లు బౌన్స్‌ను సద్వినియోగం చేసుకుంటూ వికెట్ల వేట సాగించగా.. టైటాన్స్ పూర్తి ఒత్తిడిలో పడింది. ఏ ఒక్క బ్యాటరూ క్రీజులో నిలిచే ప్రయత్నం చేయలేదు. ఈ కీలక మ్యాచ్‌లోనూ మిడిలార్డర్ ఆకట్టుకోలేకపోయింది. వాషింగ్టన్ సుందర్ మాత్రమే ఆఖరి వరకు పోరాడి గౌరవప్రదమైన స్కోరందించాడు. ఇక సక్సెస్‌ఫుల్ ఓపెనర్లుగా పేరు తెచ్చుకున్న గిల్ (10), సుదర్శన్ (12) తొలి నాలుగు ఓవర్లలోనే పెవిలియన్‌కు చేరడంతో టైటాన్స్ ఆట ఒక్కసారిగా గతి తప్పింది. బౌలర్లు కట్టడి చేయడంతో జట్టు పవర్‌ప్లేలో 45/2 స్కోరు మాత్రమే చేయగలిగింది. యువ బ్యాటర్ నిశాంత్ మూడు ఫోర్లతో ఆకట్టుకున్నా ఎనిమిదో ఓవర్‌లో రసిఖ్ అతడిని అవుట్ చేశాడు. అయితే క్రీజులో వెటరన్ బట్లర్-సుందర్ ఉండడంతో టైటాన్స్ ఆశలు వదులుకోలేదు.

పదో ఓవర్‌లో సుందర్ క్యాచ్‌ను కాక్స్ పట్టినా అతడి చేతి వేళ్లు నేలను తాకడంతో నాటౌట్‌గా ప్రకటించారు. మరోవైపు మధ్య ఓవర్లలో స్పిన్నర్ క్రునాల్, రసిఖ్ మరింత పట్టు బిగించగా 7-12 ఓవర్ల మధ్య ఒక్క బౌండరీ కూడా నమోదు కాలేదు. ఒత్తిడికి లోనైన బట్లర్.. క్రునాల్ ఓవర్‌లో ముందుకు వచ్చి షాట్ ఆడి స్టంపౌట్ అయ్యాడు. 13వ ఓవర్‌లో అర్షద్ (15) వచ్చీ రాగానే వీరి ఇన్నింగ్స్‌లో తొలి సిక్సర్ బాదాడు. తర్వాతి ఓవర్‌లో సుందర్ రెండు ఫోర్లు, అర్షద్ మరో సిక్సర్‌తో 16 పరుగులు సమకూరడంతో జట్టు గాడిలో పడినట్టనిపించింది. కానీ ఓవర్ వ్యవధిలోనే అర్షద్‌తో పాటు తెవాటియా (7) కూడా వెనుదిరగడం దెబ్బతీసింది. 18వ ఓవర్‌లో సుందర్ 4,4, హోల్డర్ (7) 4తో 16 రన్స్ రావడం కాస్త ఊరటనిచ్చింది. చివరి ఓవర్‌లో రషీద్ (7) వికెట్ కోల్పోగా.. సుందర్ 37 బంతుల్లో అజేయ హాఫ్ సెంచరీ పూర్తి చేసి స్కోరును 150 దాటించగలిగాడు.

### స్కోరుబోర్డు

గుజరాత్: సాయి సుదర్శన్ (సి) జితేశ్ (బి) భువనేశ్వర్ 12, గిల్ (సి) రజత్ (బి) హాజెల్‌వుడ్ 10, నిషాంత్ (సి) పడిక్కళ్ (బి) రసిఖ్ 20, బట్లర్ (స్టంప్డ్) జితేశ్ (బి) క్రునాల్ 19, వాషింగ్టన్ (నాటౌట్) 50, అర్షద్ (సి) రసిఖ్ (బి) హాజెల్‌వుడ్ 15, తెవాటియా (సి) రజత్ (బి) రసిఖ్ 7, హోల్డర్ (సి) హాజెల్‌వుడ్ (బి) భువనేశ్వర్ 7, రషీద్ (సి) షెఫర్డ్ (బి) రసిఖ్ 7, రబాడ (నాటౌట్) 3, ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 20 ఓవర్లలో 155/8; వికెట్ల పతనం: 1-22, 2-26, 3-55, 4-73, 5-99, 6-115, 7-142, 8-151; బౌలింగ్: డఫీ 4-0-38-0, భువనేశ్వర్ 4-0-29-2, హాజెల్‌వుడ్ 4-0-37-2, రసిఖ్ 4-0-27-3, క్రునాల్ 4-0-23-1.

బెంగళూరు: వెంకటేశ్ (సి) రబాడ (బి) సిరాజ్ 32, కోహ్లీ (నాటౌట్) 75, పడిక్కళ్ (సి) అర్షద్ (బి) రబాడ 1, రజత్ పటీదార్ (సి) రబాడ (బి) రషీద్ 15, క్రునాల్ (ఎల్బీ) రషీద్ 1, టిమ్ డేవిడ్ (సి) బట్లర్ (బి) అర్షద్ 24, జితేశ్ (నాటౌట్) 11, ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 18 ఓవర్లలో 161/5; వికెట్ల పతనం: 1-62, 2-63, 3-89, 4-91, 5-132; బౌలింగ్: సిరాజ్ 4-0-36-1, రబాడ 3-0-44-1, హోల్డర్ 2-0-16-0, రషీద్ 4-0-25-2, అర్షద్ 4-0-32-1, ప్రసిద్ధ్ 1-0-7-0.

# సింగపూర్ ఓపెన్‌లో సాత్విక్-చిరాగ్ చరిత్ర




### ఫైనల్లో అద్భుత విజయంతో టైటిల్ కైవసం

భారత స్టార్ బ్యాడ్మింటన్ జోడీ సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టి చరిత్ర సృష్టించారు. సింగపూర్ ఓపెన్ మెన్స్ డబుల్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్న తొలి భారత ద్వయంగా నిలిచారు. ఆదివారం జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్లో తొలి గేమ్ కోల్పోయినా అద్భుతంగా పుంజుకుని ఇండోనేషియాకు చెందిన ఫజర్ అల్ఫియాన్, మహమ్మద్ షోహిబుల్ ఫిక్రీ జోడీపై విజయం సాధించారు. గంటా 13 నిమిషాల పాటు సాగిన హోరాహోరీ పోరులో సాత్విక్-చిరాగ్ జోడీ 18-21, 21-17, 21-16 తేడాతో గెలుపొందింది. ఈ విజయంతో సాత్విక్-చిరాగ్ జోడీ రెండేళ్ల టైటిల్ నిరీక్షణకు తెరపడింది. 2024లో థాయ్‌లాండ్ ఓపెన్ గెలిచిన తర్వాత, ఈ జంట ఏకంగా నాలుగు ఫైనల్స్‌లో ఓడి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఈ గెలుపు వారి కెరీర్‌లో తొమ్మిదో వరల్డ్ టూర్ టైటిల్ కాగా, మూడో సూపర్ 750 టైటిల్ కావడం విశేషం. ప్రపంచ నాలుగో ర్యాంక్ జోడీ అయిన సాత్విక్-చిరాగ్, ప్రపంచ మూడో ర్యాంక్ ఇండోనేషియా ద్వయంతో జరిగిన ఈ మ్యాచ్ ఆరంభంలో తడబడింది. తొలి గేమ్‌ను కోల్పోవడంతో ఒత్తిడి పెరిగింది. అయితే, రెండో గేమ్ నుంచి భారత జోడీ పూర్తిగా పుంజుకుంది. తమదైన దూకుడైన ఆటతీరు, పదునైన స్మాష్‌లతో ప్రత్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేసింది. రెండో గేమ్‌ను గెలిచి మ్యాచ్‌ను సమం చేయడమే కాకుండా, నిర్ణయాత్మక మూడో గేమ్‌లోనూ అదే ఆధిపత్యాన్ని కొనసాగించి చారిత్రక విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది. విజయం ఖరారైన వెంటనే సాత్విక్, చిరాగ్ ఆనందంతో కోర్టుపైనే పడిపోయి భావోద్వేగంతో సంబరాలు చేసుకున్నారు. సుదీర్ఘకాలం తర్వాత టైటిల్ గెలిచిన ఆనందాన్ని ఆస్వాదిస్తూ కోర్టులో నృత్యం చేశారు. ఈ టోర్నీ సెమీఫైనల్లో ప్రపంచ ఛాంపియన్లను ఓడించి ఫైనల్‌కు చేరిన ఈ జంట, తుది పోరులోనూ అద్భుత ప్రదర్శనతో అభిమానులను అలరించింది.

# మరి కొన్నిరోజుల్లో ఫిఫా వరల్డ్ కప్

### భారత్‌లో ప్రసారాలపై ఇంకా వీడని అనిశ్చితి



ఫిఫా ఫుట్‌బాల్ ప్రపంచకప్ 2026 ప్రారంభానికి కొద్ది రోజులే ఉన్నా, భారత్‌లో ప్రసారాలపై ఇంకా సందిగ్ధత వీడలేదు. జూన్ 11న మెగా టోర్నీ మొదలుకానుండగా, ఏ ఛానెల్‌లో మ్యాచ్‌లు వస్తాయో తెలియక కోట్లాది మంది అభిమానులు ఆందోళన చెందుతున్నారు. అయితే, చివరి నిమిషంలో ఈ ఉత్కంఠకు తెరపడనున్నట్లు తెలుస్తోంది. ప్రముఖ బ్రాడ్‌కాస్టింగ్ సంస్థ 'జీ' నెట్‌వర్క్ ప్రసార హక్కులను దక్కించుకునేందుకు గట్టిగా అడుగులు వేస్తున్నట్టు సమాచారం. దాదాపు 30-35 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 250-290 కోట్లు) ఒప్పందంతో జీ నెట్‌వర్క్ ఈ హక్కులను సొంతం చేసుకునే అవకాశాలున్నాయి. ఒప్పందం ఖరారైతే, టోర్నీలోని మొత్తం 104 మ్యాచ్‌లను జీ స్పోర్ట్స్ ఛానెళ్లలో, అలాగే జీ5 ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో బహుళ భాషల కామెంటరీతో ప్రసారం చేయనున్నారు. అతి త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడవచ్చని భావిస్తున్నారు. ఈసారి ప్రసార హక్కుల విషయంలో జాప్యం జరగడానికి ప్రధాన కారణం ఫిఫా మొదట అధిక ధర డిమాండ్ చేయడమే. 2026, 2030 సీజన్లకు కలిపి దాదాపు 100 మిలియన్ డాలర్లు ఆశించడంతో బ్రాడ్‌కాస్టర్లు వెనకడుగు వేశారు. దీనికి తోడు, భారత్‌లోని వీక్షకులకు మ్యాచ్ సమయాలు అనుకూలంగా లేకపోవడం మరో ప్రతికూలాంశంగా మారింది. చాలా మ్యాచ్‌లు అర్ధరాత్రి, తెల్లవారుజామున జరగనున్నాయి. మొత్తం 104 మ్యాచ్‌లలో కేవలం 14 మాత్రమే భారత కాలమానం ప్రకారం అర్ధరాత్రిలోపు ప్రారంభం కానున్నాయి. ఫైనల్ మ్యాచ్ సైతం అర్ధరాత్రి దాటాక 12:30 గంటలకు జరగనుంది. ఈ కారణాలతో జియోస్టార్ కేవలం 20 మిలియన్ డాలర్ల ప్రతిపాదనను ఫిఫా ముందుంచింది. అయితే ఈ ఆఫర్‌ను ఫిఫా తిరస్కరించింది. భారత జట్టు ప్రపంచకప్‌కు అర్హత సాధించకపోయినా, ఇక్కడ ఫుట్‌బాల్‌కు విపరీతమైన ఆదరణ ఉంది. 2022లో ఖతార్‌లో జరిగిన ప్రపంచకప్‌ను భారత్‌లో 110 మిలియన్ల మంది డిజిటల్ మాధ్యమాల్లో వీక్షించారు. ఇది ఫిఫా ప్రపంచ వీక్షకుల్లో 2.9 శాతం కావడం విశేషం. ఏదేమైనా, ఆలస్యమైనప్పటికీ అభిమానులకు ప్రపంచకప్ మ్యాచ్‌లను చూసే అవకాశం లభించడం ఖాయంగానే కనిపిస్తోంది.



# విజయ్ గారి పట్ల గర్విస్తున్నాను

## చెన్నైలో రామ్ చరణ్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ 'పెద్ది' చిత్రం ప్రమోషన్ల కోసం చెన్నైలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చెన్నైతో తనకున్న విడదీయరాని బంధాన్ని గుర్తుచేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. తన కెరీర్, కొత్త సినిమా, సహనటులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా తమిళనాడు ముఖ్యమంత్రి, నటుడు విజయ్‌పై చేసిన ప్రశంసలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సినిమా కోసం మూడు రకాల శారీరక మార్పులకు లోనయ్యానని, అయితే దర్శకుడు బుచ్చిబాబును డీల్ చేయడమే తనకు అతిపెద్ద ఛాలెంజ్‌గా అనిపించిందని చరణ్ చమత్కరించారు. కుస్తీ సన్నివేశాల చిత్రీకరణలో తన చేతికి గాయమైందని, దానిని బుచ్చిబాబు తనకు ఇచ్చిన అందమైన బహుమతిగా భావిస్తున్నానని నవ్వుతూ చెప్పారు. అనంతరం తమిళనాడు సీఎం విజయ్ గురించి మాట్లాడుతూ, "కెరీర్ శిఖర స్థాయిలో ఉన్నప్పుడు, ఇంత స్టార్‌డమ్ ఉన్న సమయంలో వాటన్నింటినీ వదిలి ప్రజాసేవ కోసం ముందుకు రావడం స్ఫూర్తిదాయకం. ఒక ఫిల్మ్ ఇండస్ట్రీ వ్యక్తిగా ఆయనను చూసి గర్వపడుతున్నాను" అని రామ్ చరణ్ అభినందనలు తెలిపారు. పెద్ది సినిమా పిల్లలకు కూడా స్ఫూర్తినిచ్చేలా ఉంటుందని, తన లైబ్రరీలో జీవితాంతం గుర్తుండిపోయే చిత్రం అని తెలిపారు.



# దేవయానికి బిగ్ ఛాన్స్..

టాలీవుడ్ లో మంచి ఛాన్సుల కోసం వెయిట్ చేస్తున్న నార్త్ బ్యూటీ దేవయాని శర్మకు ఇప్పుడు కెరీర్ లోనే బిగ్గెస్ట్ ఛాన్స్ దక్కినట్లు కనిపిస్తోంది. ఓటీటీ ఆడియన్స్ లో స్పెషల్ క్రేజ్ సొంతం చేసుకున్న ఆమె, ఇప్పుడు స్టార్ హీరో విక్టరీ వెంకటేష్ అప్ కమింగ్ మూవీలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో ఆ ఛాన్స్ ఆమె కెరీర్ కు గేమ్ ఛేంజర్ గా మారే అవకాశాలు ఉన్నాయని టాక్ వినిపిస్తోంది. అయితే ఢిల్లీకి చెందిన దేవయాని శర్మ తెలుగు ప్రేక్షకులకు కొత్త కాదు. సేవ్ ది టైగర్స్ వెబ్ సిరీస్ తో ఫ్యామిలీ ఆడియన్స్ కు చేరువైన ఆమె, తన యాక్టింగ్ తో ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. అయితే వెబ్ సిరీస్ ల రేంజ్ ను దాటి సినిమాల్లోనూ మంచి ప్లేస్ సొంతం చేసుకోవాలని ఆమె ప్రయత్నిస్తోంది. అలాంటి సమయంలో వెంకటేష్- త్రివిక్రమ్ వంటి క్రేజీ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న సినిమాలో అవకాశం రావడం విశేషంగా మారింది. ఇప్పటికే శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఆదర్శ కుటుంబం (ఏకె47) చిత్రంలో దేవయాని శర్మ కీలక పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ఇటీవల సోషల్ మీడియాలో వచ్చిన ఓ పోస్టుకు రెస్పాండ్ అవుతూ ఆమె ఆ ప్రాజెక్టులో భాగమైన విషయాన్ని పరోక్షంగా చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే షూటింగ్ లో కూడా జాయిన్ అయినట్లు టాక్ వినిపిస్తోంది. సినిమాలో ఆమె రోల్ కు మంచి ఇంపార్టెన్స్ ఉంటుందని, కథలో కీలక ట్విస్టులకు కారణమయ్యే పాత్రగా ఉండొచ్చని ప్రచారం జరుగుతోంది. ఇదే నిజమైతే దేవయానికి తన టాలెంట్ ను నిరూపించుకునేందుకు పెద్ద ఛాన్స్ దక్కినట్లే. ముఖ్యంగా సినిమాలో తన రోల్ లో యాక్టింగ్ తో మెప్పిస్తే ఆమెకు తెలుగులో వరుస అవకాశాలు వచ్చే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



# హిమాలయాల్లో ప్రకృతి అందాల నడుమ డాక్టర్ శ్రీలీల

టాలీవుడ్ సెన్సేషనల్ బ్యూటీ శ్రీలీల తాజాగా హిమాలయాల పర్యటనకు వెళ్ళిన ఫోటోలను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేయగా.. అవి నెట్టింట జోరుగా వైరల్ అవుతున్నాయి. గడ్డకట్టే చలిని సైతం లెక్కచేయకుండా ఈ బ్యూటీ మంచు పర్వతాలలో ఎంతో జాలీగా దిగిన అద్భుతమైన ఫోటోలు సామాజిక మాధ్యమాలలో అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ఇండస్ట్రీలో వరుస షూటింగ్‌లతో క్షణం తీరిక లేకుండా గడిపే ఈ కన్నడ బ్యూటీ కాస్త బ్రేక్ దొరకడంతో ఇలా హిమాలయాల మంచు కొండల నడుమ ప్రకృతి అందాలను ఆస్వాధిస్తూ సేదతీరుతోంది. ప్రస్తుతం శ్రీలీల కెరీర్ పరంగా ఎంతో కీలకమైన దశలో ఉంది. ఇటు తెలుగు చిత్ర పరిశ్రమలో టాప్ హీరోల సరసన పలు క్రేజీ ప్రాజెక్ట్‌లలో నటిస్తూనే.. అటు హిందీ ఇండస్ట్రీలోకి కూడా గ్రాండ్ ఎంట్రీ ఇస్తోంది. బాలీవుడ్ యువ హీరో కార్తీక్ ఆర్యన్ సరసన ఒక భారీ హిందీ చిత్రంలో నటిస్తుండగా... ఈ కాంబినేషన్ బాక్సాఫీస్ వద్ద బిగ్ బ్లాక్ బస్టర్ వైబ్స్ తెస్తుందని చిత్ర వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌తో బాలీవుడ్‌లోనూ ఎదిగేందుకు ఈ గ్లామర్ డాళ్ సిద్ధమవుతోంది. జయాపజయాలతో సంబంధం లేకుండా బ్యాక్ టు బ్యాక్ సినిమాల్లో నటిస్తున్న శ్రీలీల, అటు ప్రొఫెషనల్ లైఫ్‌ను ఇటు పర్సనల్ లైఫ్‌ను ఎంతో చక్కగా బ్యాలెన్స్ చేస్తోంది. ఇటీవలే తన ఎంబీబీఎస్ స్టడీస్ ని కూడా పూర్తి చేసి డాక్టర్ గా ప్రాక్టీస్ ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఓవైపు నటిగా అగ్రతాంబూలం అందుకుంటోంది. మరోవైపు ఉన్నత చదువులు చదివి స్థిరమైన ఆలోచనతో ముందుకు సాగుతోంది.



# లేటెస్ట్ అవుట్ ఫిట్‌తో మ్యాజిక్ చేస్తున్న బాలయ్య బ్యూటీ!

అందం, అభినయంతో చక్కటి చిరునవ్వుతో అభిమానుల హృదయాలను దోచుకుంటూ తెరపై తన అద్భుతమైన నటనతో ఊహించని పాపులారిటీ సొంతం చేసుకుంది ప్రగ్యా జైస్వాల్. అవకాశం లభించాలే కానీ పాత్రలో లీనమైపోయి అందరి దృష్టిని ఆకట్టుకునే ఈ ముద్దుగుమ్మ.. సోషల్ మీడియాలో మాత్రం నిత్యం యాక్టివ్ గా ఉంటూ నెటిజన్స్ ను అలరిస్తోంది. ఇండస్ట్రీలోకి రాకముందు మోడల్ గా తన కెరీర్ మొదలుపెట్టిన ఈమె సింబయాసిస్ కాలేజీలో చదువుతున్న రోజుల్లోనే వివిధ రకాల అందాల పోటీలలో పాల్గొని సక్సెస్ఫుల్ మోడల్ గా ఎదిగింది. మోడల్ గా తన ప్రయాణాన్ని మొదలుపెట్టిన ప్రగ్యా జైస్వాల్ కళా, సంస్కృతి రంగంలో ఈమె సాధించిన విజయానికి 2014 జనవరి 22న సింబయోసిస్ సాంస్కృతిక పురస్కారం లభించింది. 2008 ఫెమినా మిస్ ఇండియా పోటీలలో పాల్గొని.. మిస్ ఫ్రెష్ ఫేస్, మిస్ డాన్సింగ్ క్వీన్, మిస్ ఫ్రెండ్ ఆఫ్ ఎర్త్ వంటి టైటిల్స్ ను సొంతం చేసుకుంది. మోడల్గా అందాలు ఆరబోస్తూ రెడ్ కార్పెట్ పై ర్యాంప్ వాక్ తో హొయలు పోతూ వాణిజ్య సంస్థల దృష్టిని ఆకర్షించింది. ఇక అలా డవ్, డాబర్ వాటిక, మిలీనియం హైపర్ మార్కెట్ ఫర్ దుబాయ్, ఎఫ్ బీబీ, రిలయన్స్ డిజిటల్ వంటి ప్రముఖ వాణిజ్య పాపులర్ బ్రాండ్స్ కి అంబాసిడర్ గా పనిచేసింది.

# వైభవంగా హుస్నాబాద్ రేణుక ఎల్లమ్మ జాతర

**కాకతీయుల కాలం నాటి చారిత్రక ఆలయం**

**నెల రోజుల పాటు కొనసాగనున్న శతాబ్దాల సంప్రదాయం**

**మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో వేగంగా ఆలయ అభివృద్ధి**



హుస్నాబాద్,జనత న్యూస్: చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలిచిన హుస్నాబాద్ పట్టణంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆలయం భక్తులతో కళకళలాడుతోంది.కాకతీయుల కాలం నాటి విశిష్ట చరిత్ర కలిగిన ఈ ఆలయ ప్రాంగణంలో శతాబ్దాల నాటి సంప్రదాయం ప్రకారం వార్షిక జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి.వైశాఖ పౌర్ణమి నాడు ప్రారంభమైన ఈ ఉత్సవాలు జ్యేష్ఠ పౌర్ణమి వరకు నెల రోజుల పాటు సాగనున్నాయి. ఆలయ పరిసరాల్లోని ఎల్లమ్మ చెరువు సైతం ఈ క్షేత్ర ప్రాశస్త్యాన్ని చాటుతోంది.సాంప్రదాయబద్ధంగా పూజలు.. మొక్కులు జాతర సందర్భంగా ఉమ్మడి కరీంనగర్, సిద్దిపేట జిల్లాల నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివస్తున్నారు.అమ్మవారిని దర్శించుకుని ఓడి బియ్యం పోయడం, బోనాలు సమర్పించడం, పట్నాలు వేయడం వంటి మొక్కులు చెల్లించుకుంటున్నారు.అనంతరం బంధుమిత్రులతో కలిసి ఆలయ ప్రాంగణంలోనే విందు భోజనాలు ఆరగిస్తున్నారు.శతాబ్దాలుగా వస్తున్న ఆనవాయితీ ప్రకారం.. వైశాఖ పౌర్ణమి రోజున హుస్నాబాద్‌కు చెందిన గౌడ కులస్థులు, శాశ్వత ధర్మకర్తలు అమ్మవారికి బాషింగాలు కట్టి జాతరను సాంప్రదాయబద్ధంగా ప్రారంభిస్తారు. తిరిగి జ్యేష్ఠ పౌర్ణమి రోజున ఆ బాషింగాలను విప్పడంతో నెల రోజుల జాతర ముగుస్తుంది. కేవలం జాతర రోజుల్లోనే కాకుండా, ఏడాది పొడవునా ప్రతి మంగళ, శుక్ర, ఆదివారాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో ఇక్కడికి వస్తుంటారు.మంత్రి చొరవతో మారుతున్న ఆలయ రూపురేఖలు భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో ఆలయ అభివృద్ధి పనులు వేగవంతంగా సాగుతున్నాయి. గతంలో భక్తులు ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మంత్రి ఆదేశాలతో ప్రహరీ గోడ నిర్మాణం, భక్తుల విశ్రాంతి కోసం మూడు అత్యాధునిక షెడ్ల ఏర్పాటు చేశారు.వీటితో పాటు శిథిలావస్థకు చేరిన పురాతన పోచమ్మ దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా పునర్నిర్మించడంతో పాటు, దేవాదాయ శాఖ కామన్ గుడ్ ఫండ్ ద్వారా శాశ్వత అన్నదాన మండపం, షాపింగ్ కాంప్లెక్స్ పనులను చేపట్టారు. ఎండ తీవ్రత దృష్ట్యా జాతర ముగిసేవరకు భక్తుల దాహార్తిని తీర్చేందుకు మినీ వాటర్ ట్యాంకులను కూడా ఏర్పాటు చేస్తున్నారు.ఘనంగా ప్రత్యేక ఉత్సవాలు ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో శాశ్వత ధర్మకర్తలు పూదరి లక్ష్మీనారాయణ గౌడ్, పచ్చిమట్ల రవీందర్ గౌడ్, పచ్చిమట్ల శ్రీనివాస్ గౌడ్, పూదరి చంద్రమౌళి గౌడ్, మాటూరి గోపి గౌడ్, పచ్చిమట్ల శివ గౌడ్, పచ్చిమట్ల నరేష్ గౌడ్, బొమ్మగాని రజినీకాంత్ గౌడ్, బొమ్మగాని సదానందం గౌడ్, మాటూరి ప్రేమ్ కుమార్ గౌడ్, మాటూరి బాలయ్య, పచ్చిమట్ల మోహన్ గౌడ్ పాల్గొన్నారు. వారితో పాటు దేవాలయ ఈవో పి. కిషన్ రావు, ప్రధాన అర్చకులు తాటికొండ పరమేశ్వర్, ఆలయ సిబ్బంది కుమారస్వామి, గీకురు రమేష్ తదితరులు భక్తులకు ఎలాంటి లోటుపాట్లు రాకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# మండలానికో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలి

**మాతృభాషను పరిరక్షించుకోవాలి**

**మాజీ కేంద్రమంత్రి, మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు**



తిమ్మాపూర్ జనతా న్యూస్ : ఉపాధి అవకాశాల కోసం శిక్షణ ఇచ్చేందుకు ప్రతి మండలానికి ఒక స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని మాజీ కేంద్రమంత్రి, తమిళనాడు మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్ రావు విజ్ఞప్తి చేశారు. శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో బిజెపి శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ

అత్యధిక జనాభా ఉన్న రాష్ట్రంలో యువత అధికంగా ఉన్నందున ప్రతి మండలానికి ఒక స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను ఏర్పాటు చేసి అందులో యువతకు ఉపయోగపడే శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. చేతివృత్తులు, శ్రమ శక్తిని బయటకు తీయాలని కోరారు. 17 శతాబ్దంలోనే మన దేశం 27 శాతం జిడిపితో ముందంజలో ఉన్నదని తెలిపారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి స్కిల్ డెవలప్మెంట్ విషయంలో సానుకూలంగా ఉన్నారని, తప్పకుండా మండలానికి ఒక రెసిడెన్షియల్ సెంటర్ ఏర్పాటు చేయడానికి సానుకూలంగా స్పందించాలని ఆయన కోరారు. గతంలో తాను ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు చేసిన మూడు సెంటర్లు ఇప్పటికీ కొనసాగుతున్నాయని, అవి సత్ఫలితాలను ఇస్తున్నాయని ఆయన తెలిపారు. టెక్స్టైల్ పార్క్ కోసం 1930 లోనే వరంగల్ లో ఎయిర్ పోర్టు ఏర్పాటు అయిందని తెలిపారు. నిజామాబాద్ లో సైతం చేనేత వస్త్రాలు ఉత్పత్తి అయ్యేవని, 1851లో లండన్ దేశం లోని క్రిస్టల్ ప్యాలెస్ హైడ్ పార్క్ లో ఏర్పాటు చేసిన చేతివృత్తుల ఎగ్జిబిషన్లో 100 దేశాలు పాల్గొన్నాయని, అందులో వరంగల్ చేనేత వస్త్రానికి మొదటి బహుమతి వచ్చిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో జిడిపి పెరిగేందుకు, స్మాల్ మీడియం ఎంటర్ప్రైజెస్ ఏర్పాటు కోసం ప్రయత్నం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి వ్యక్తి తన మాతృభాషను కాపాడుకునేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాతృభాష కోసం కృషి చేసిన పంప విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పైన ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మీడియా సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగిడి కృష్ణారెడ్డి కరీంనగర్ మేయర్ కొలకాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, బిజెపి నాయకులు బాస సత్యనారాయణ, ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కళ్యాణ్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 2న ఉద్యమకారుల ర్యాలీని జయప్రదం చేయండి

**హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ పిలుపు**

**మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేత**



హుస్నాబాద్,జనత న్యూస్:తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్ 2న నిర్వహించనున్న ఉద్యమకారుల ర్యాలీని విజయవంతం చేయాలని హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ (ఉమ్మడి కార్యాచరణ కమిటీ) పిలుపునిచ్చింది.ఈ మేరకు జేఏసీ నియోజకవర్గ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి, కో కన్వీనర్ మేకల వీరన్న యాదవ్ ఒక ప్రకటనలో వివరాలను వెల్లడించారు.జూన్ 2న ఉదయం 9 గంటలకు హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తా నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు ఈ ర్యాలీ కొనసాగుతుందని, అనంతరం అక్కడ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు వారు తెలిపారు.

### గుర్తింపు కమిటీని విస్తరించాలి

రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీని ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే ఈ కమిటీ సమగ్రంగా లేదని జేఏసీ నాయకులు అభిప్రాయపడ్డారు.కమిటీలో ఉద్యమ సంస్థల ప్రతినిధులు, మేధావులు, విశ్రాంత న్యాయమూర్తులు, మాజీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను సభ్యులుగా చేర్చి తక్షణమే విస్తరించాలని డిమాండ్ చేశారు.

### జేఏసీ ప్రధాన డిమాండ్లు

పోలీసు కేసులతో సంబంధం లేకుండా, క్షేత్రస్థాయిలో పోరాడిన నిజమైన తెలంగాణ ఉద్యమకారులందరినీ ప్రభుత్వం గుర్తించాలని జేఏసీ నాయకులు కోరారు. గుర్తింపు పొందిన ప్రతి ఉద్యమకారునికి 250 గజాల ఇంటి స్థలంతో పాటు, నెలకు రూ.25 వేల గౌరవ పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యమకారుల కుటుంబాలకు ఉచిత విద్య, వైద్య సదుపాయాలతో పాటు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలన్నారు.మలిదశ ఉద్యమం కారణంగా విద్యాసంవత్సరాలు, ఉద్యోగ అవకాశాలు కోల్పోయిన వారికి వయ పరిమితితో సంబంధం లేకుండా ప్రభుత్వం ఉపాధి కల్పించాలని, వారి సంక్షేమం కోసం ప్రత్యేకంగా ఒక బోర్డును ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.

### రాజకీయాలకు అతీతంగా తరలిరావాలి

నియోజకవర్గంలోని ఉద్యమకారులు, వివిధ ఉద్యమ సంస్థలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యోగుల సంఘాలు, విద్యార్థి, యువజన, రైతు, కార్మిక, జర్నలిస్టు మరియు వివిధ వృత్తి సంఘాల ప్రతినిధులు రాజకీయాలకు అతీతంగా ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కన్వీనర్ లక్ష్మారెడ్డి కోరారు.ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు మేకల వీరన్న యాదవ్, మడప ప్రభాకర్ రెడ్డి, కోయడ కొమురయ్య, బసిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, ఐలేని మల్లికార్జునరెడ్డి, ఉప్పుల వెంకటరమణారెడ్డి, ఎడబోయిన తిరుపతి రెడ్డి, ఎంఏ. అన్వర్, గడిపే మల్లేష్, లావుడ్య కిషన్ నాయక్, ఇల్లందుల లక్ష్మణ్, భుక్య రమేశ్ నాయక్, పి.రాజ్ కుమార్, బండి పుష్ప, బత్తుల చంద్రమౌళి, మెతుకు కొమురయ్య, ఎం. ప్రభాకర్ రెడ్డి, ఎన్. అజయ్ కుమార్, చింతల రామచంద్రం, జె. యాదగిరి, వినీత్ తదితరులు పాల్గొన్నారు.

# బాసరలో సీట్లు సాధించిన విద్యార్థులు

**విద్యార్థులను అభినందించిన ప్రిన్సిపాల్ హార్జిత్ కౌర్**




చిగురుమామిడి,జనత న్యూస్: రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్‌జీయూకేటీ) బాసర ట్రిపుల్ ఐటీ ప్రవేశాల్లో తెలంగాణ ప్రభుత్వ మోడల్ స్కూల్, చిన్నముల్కనూర్ విద్యార్థులు విశిష్ట ప్రతిభ కనబరిచారు. పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన ఏ. యశ్వంత్‌రెడ్డి, బి. సాత్విక్‌రెడ్డి, కంది శ్రీనికరెడ్డి తమ ప్రతిభతో ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు.విద్యార్థుల కృషి, పట్టుదల, తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం ఫలితంగానే ఈ విజయం సాధ్యమైందని పాఠశాల వర్గాలు పేర్కొన్నాయి. వీరి విజయాలు ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ హార్జిత్ కౌర్‌తో పాటు ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించింది.భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించింది. ఈ విద్యార్థులను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ లక్ష్యసాధనకు కృషి చేయాలని సూచించింది.

# యాదగిరీశుడి దర్శనానికి మస్తు జనం

**ఉచిత దర్శనానికి నాలుగు, ప్రత్యేక దర్శనానికి గంటన్నర సమయం**

**సండే ఒక్కరోజే ఆలయానికి రూ.81,77,104 ఆదాయం**



యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేసవి సెలవులకు తోడు ఆదివారం కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు ఆలయానికి భారీగా తరలివచ్చారు. దీంతో స్వామివారి దర్శనానికి గంటల తరబడి క్యూలైన్లలో వెయిట్ చేయాల్సి వచ్చిందని భక్తులు తెలిపారు. రద్దీ కారణంగా స్వామివారి ధర్మ దర్శనానికి నాలుగు గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి గంటన్నర సమయం పట్టింది. భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి కొండ కింద కళ్యాణకట్ట, లక్ష్మీపుష్కరిణి, సత్యనారాయణ స్వామి వ్రత మండపాలు, అన్నప్రసాద వితరణ కేంద్రం, పార్కింగ్ ఏరియా.. కొండపైన బస్ బే, దర్శన, ప్రసాద క్యూలైన్లు, ప్రధానాలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారాయి. ఆలయ పరిసరాల్లో ఎక్కడ చూసినా భక్తజన సందోహమే కనిపించింది. రద్దీ అధికంగా ఉండడంతో భక్తులు ఎక్కువగా వీఐపీ, బ్రేక్ దర్శన సదుపాయాన్ని వినియోగించుకున్నారు. వీఐపీ టికెట్ల ద్వారా 10,819 మంది భక్తులు.. బ్రేక్ దర్శనాల ద్వారా 2,667 మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని తరించారు. ఇక ఆలయంలో నిర్వహించిన స్వామివారి నిత్యకళ్యాణం, బ్రహ్మోత్సవం, సుదర్శన నారసింహ హోమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. మరోవైపు ఆలయంలో నిత్య పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం సుప్రభాతంతో మొదలై రాత్రి పవళింపు సేవ, శయనోత్సవ సేవతో ముగిశాయి.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com